
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 1 ఏప్రిల్ 2025

సాగర్‌నగర్‌లో షమీ ప్రార్థన



సాగర్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భారత క్రికెటర్ మహ్మద్ షమీ రంజాన్‌ను పురస్కరించుకుని సోమవారం సాగర్‌నగర్ సమీపంలోని తాటిచెట్లపాలెం మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సభ్యుడిగా ఉన్న షమీ...ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్ ఆడాడు. మ్యాచ్ అనంతరం హోటల్‌లో బస చేసిన షమీ సోమవారం రంజాన్ కావడంతో సమీపంలో ఉన్న మసీదులో ప్రార్థన చేయడానికి విచ్చేశారు.

గ్రేటర్ రికార్డు

ఆస్తి పన్ను రూపేణా రూ.510 కోట్లు రాక

- జీవీఎంసీ చరిత్రలో ఇదే అత్యధికం



విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ)కు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను రూపేణా రూ.510 కోట్లు సమకూరింది. జీవీఎంసీ చరిత్రలో ఇదే అత్యధికం. నగర పరిధిలో 5,89,994 ప్రైవేటు అసెస్‌మెంట్‌లు, 39,391 వీఎల్‌టీ అసెస్‌మెంట్‌లు, 1,630 రాష్ట్ర ప్రభుత్వ సంస్థల అసెస్‌మెంట్‌లు, 524 కేంద్ర ప్రభుత్వ సంస్థల అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటి ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.450 కోట్లు ఆస్తి పన్ను వసూలైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగా గత జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు యాక్షన్ ప్లాన్ తయారుచేశారు. వార్డు సచివాలయాల వారీగా ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్నుల అసెస్‌మెంట్‌లను మ్యాపింగ్ చేయించారు. సచివాలయంలోని అడ్మిన్ సెక్రటరీలు తమ పరిధిలోని అసెస్‌మెంట్‌లకు వెళ్లి పన్ను బకాయిలు వసూలయ్యేలా చేయగలిగారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడం కూడా కలిసివచ్చింది. చాలా మంది బకాయిదారులు పన్ను చెల్లింపునకు ముందుకువచ్చారు. అలాగే జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా రెండు నెలలుగాపైగా బాధ్యతలు నిర్వర్తించడం కూడా ... మిగతా 6వ పేజీలో

భక్తి శ్రద్ధలతో రంజాన్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముస్లిం సోదరులు సోమవారం రంజాన్ (ఈదుల్ ఫిత్ర్) పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. కోటవీధి, చెంగలరావుపేట, జగదాంబ జంక్షన్, చినవాల్తేరు, అక్కయ్యపాలెం, అల్లిపురం, ముస్లిం తాటిచెట్లపాలెం, న్యూకాలనీ, మర్రిపాలెం, గోపాలపట్నం, గాజువాక, పెందుర్తి, ఎంవీపీ కాలనీ, మధురవాడ ప్రాంతాల్లోని మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. మసీదు ఇమామ్‌లు రంజాన్ సందేశాన్ని వినిపించారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఉమెన్స్ కాలేజీ సమీపంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

నేటి నుంచి కేజీహెచ్‌లో ప్రతి రోజూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు



విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలో ఇకపై ప్రతిరోజూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించనున్నారు. ప్రస్తుతం కొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వారంలో రెండు, మూడు రోజులు మాత్రమే రోగులను చూస్తున్నారు. దీనివల్ల సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ సేవలందించేలా ఆస్పత్రి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద సోమవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. న్యూరాలజీ, యూరాలజీ, ఎండో క్రైనాలజీ విభాగాల్లో ఓపీ సేవలు ఇప్పటి వరకూ మంగళ, గురు, శనివారాల్లో మాత్రమే ... మిగతా 6వ పేజీలో

ఆర్థిక శక్తిగా విశాఖ

పర్యాటకం, వాణిజ్యం, ఇన్నోవేషన్ కేంద్రంగా అభివృద్ధి

కొత్త తరం కంపెనీలకు కేంద్రంగా నగరం

- విశాఖను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసి ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- మంత్రి నారా లోకేశ్





ప్రైవేటు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్. పార్టీ కార్యాలయంలో లోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ ఉపాధ్యాయ సమాఖ్య ప్రతినిధులు

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): **విశాఖపట్నం రాష్ట్రానికి గుండె వంటిదని, దీనిని ఓ ఆర్థిక శక్తి (ఎకనామిక్ పవర్ హౌస్)గా మారుస్తామని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. నగరంలో సోమవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, విశాఖను పర్యాటకం, వాణిజ్యం, ఆవిష్కరణ (ఇన్నోవేషన్)ల కేంద్రంగా అభివృద్ధి చేయనున్నామని ప్రకటించారు.**

భారతదేశం భవిష్యత్తును నిర్దేశించే కొత్త తరం కంపెనీలకు విశాఖపట్నం కేంద్రంగా ఉండాలని తమ ప్రభుత్వం భావిస్తున్నదని చెప్పారు. యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తాము ఎన్నికలలో హామీ ఇచ్చామని, ఆ దిశగా సృష్టించే ప్రతి ఉద్యోగం పరోక్షంగా మరో నలుగురికి ఉపాధి కల్పిస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు సానుకూలంగా తాము తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్రాన్ని స్థిరమైన ఆర్థికాభివృద్ధి దిశగా నడిపిస్తాయని మంత్రి లోకేశ్ ఆశాభావం వ్యక్తంచేశారు.

విశాఖను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేసి ఐదు లక్షలమందికి ... మిగతా 6వ పేజీలో

పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్

వినతులు స్వీకరించిన మంత్రి నారా లోకేశ్

- బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ సోమవారం పార్టీ కార్యాలయంలో 60వ ప్రజా దర్బార్ నిర్వహించారు. పలువురి నుంచి వినతులు స్వీకరించిన ఆయన... ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వేపగుంట జడ్పీ ఉన్నత పాఠశాల వెనుకనున్న ప్రభుత్వానికి చెందిన స్థలాన్ని గత ప్రభుత్వంలో కీలక వ్యక్తుల అండతో కొందరు ఆక్రమించుకుని భారీ భవంతులు నిర్మించారని రాపర్తి రాజు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరగా, తప్పకుండా కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులను డీఎస్సీ ద్వారా మాత్రమే నియమించేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ ఉపాధ్యాయ సమాఖ్య ప్రతినిధులు కోరారు. రిటైరైన ఇద్దరు పాడేరు ఐటీడీఏలో పనిచేస్తున్నారని, వారిరువురినీ తొలగించి అర్హులను నియమించాలని ఎన్.శ్రీనివాసరావు కోరారు. ఇంజనీరింగ్ ... మిగతా 6వ పేజీలో

బ్రేకుల్లేని భారీ వాహనాలు!

నగరంలో ఇష్టారాజ్యంగా రాకపోకలు

- ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్...
- ఇక్కడ సరకు రవాణాకు వినియోగం
- నిషేధాజ్ఞల ఉల్లంఘన
- తరచుగా రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని పోలీస్, రవాణా శాఖ అధికారులు
- వాళ్లను 'మేనేజ్' చేస్తున్నట్టు చెప్పుకుంటున్న నిర్వాహకులు



వెంకోజీపాలెం వద్ద ఇటీవల బీభత్సం సృష్టించిన లారీ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సరకు రవాణా చేసే భారీ లారీలు బీభత్సం సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలో వాటి రిజిస్ట్రేషన్‌పై ఆంక్షలు ఉండడంతో ఇతర రాష్ట్రాల్లో చేయించుకుని, నగరంలో తిప్పుతున్నారు. అదే విధంగా సిటీలోకి పగటి పూట భారీ వాహనాల ప్రవేశించరాదని నిబంధనలు ఉన్నప్పటికీ యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. వాటి వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు తీసు కునేందుకు ఎందుకనో పోలీస్, రవాణా శాఖ అధికారులు వెనుకాడుతున్నారు.

సరకు రవాణాకు ఉపయోగించే భారీ వాహనాల రిజిస్ట్రేషన్‌కు రాష్ట్రంలో ఆంక్షలు ఉండడంతో ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. నేషనల్ పర్మిట్ ఉంటే దేశంలో ఎక్కడైనా తిరగవచ్చుననే వెసులుబాటును ఆసరాగా తీసుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాహన యజమాని ఎక్కడో ఉంటున్నా...నగరం లేదా ఉత్తరాంధ్రలో ఉండే స్థానిక వ్యాపారులు వాటిని లీజుకు తీసుకుంటున్నారు. అలాంటి వాహనాలను పోర్టు నుంచి సరకు రవాణాకు, నగర శివారు ప్రాంతాల నుంచి మట్టి, గ్రావెల్ తరలింపు, ఆయిల్ కంపెనీల నుంచి చమురు తరలింపు కోసం వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ కలిగిన భారీ వాహనాలపై కొన్ని రకాల ఆంక్షలు ఉన్నాయి. వాటికి లోబడే ఆయా వాహనాలు నగరంలోకి వచ్చిపోవాల్సి ఉంటుంది. పోర్టు, స్టీల్‌ప్లాంట్, చమురు సంస్థల నుంచి సరకు ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లాలనుకుంటే లోడ్ చేసుకున్న తర్వాత నగరం నుంచి బయటకు వెళ్లిపోవాల్సి ఉంటుంది. అంతేతప్ప నగరంలో అంతర్గతంగా సరకు రవాణా చేయడం కుదరదు. భారీ వాహనాలు నగర అంతర్గత రోడ్లపై రాకపోకలు సాగిస్తే, ట్రాఫిక్ జామ్‌లతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటా యనే ఉద్దేశంతో అధికారులు ... మిగతా 6వ పేజీలో

మహా ఉత్కంఠ

అవిశ్వాస తీర్మానంపై 19న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

- తీర్మానం నెగ్గాలంటే 74 మంది బలం అవసరం
- కూటమికి ప్రస్తుతం 72 మంది మద్దతు
- మ్యాజిక్ ఫిగర్ కోసం కూటమి యత్నాలు
- తమ కార్పొరేటర్లను ఇప్పటికే బెంగళూరు తరలించిన వైసీపీ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై అవిశ్వాసం ప్రకటిస్తూ కూటమి కార్పొరేటర్లు నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో...ఏప్రిల్ 19న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ నిర్ణయించారు. దీంతో ఇరువర్గాల్లో ఉత్కంఠ మొదలైంది. అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన బలం సంపాదించుకునేందుకు కూటమి యత్నిస్తుంటే... తీర్మానం వీగిపోయేలా చేయాలని వైసీపీ ఆరాటపడుతోంది.

నాలుగేళ్ల కిందట జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో మెజారిటీ వార్డులు దక్కించుకుని వైసీపీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. అయితే గత ఏడాది జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో కౌన్సిల్‌లో కూడా బలబలాలు మారిపోయాయి. వైసీపీకి చెందిన 18 మంది కార్పొరేటర్లతోపాటు ఆ పార్టీకి మద్దతుగా నిలిచిన ఇద్దరు ఇండిపెండెంట్లు టీడీపీలో చేరగా, మరో ఏడుగురు కార్పొరేటర్లు, ఒక ఇండిపెండెంట్ కార్పొరేటర్ జనసేనలో చేరిపోయారు.

ప్రస్తుతం బలాబలాలు	
టీడీపీ కార్పొరేటర్లు	48
జనసేన	11
బీజేపీ కార్పొరేటర్లు	2
కూటమి ఎక్స్‌అఫిషియో సభ్యులు	11
మొత్తం కూటమి బలం	72
వైసీపీ కార్పొరేటర్లు	34
ఎక్స్‌అఫిషియో సభ్యులు	3
మొత్తం వైసీపీ బలం	37
సీపీఐ కార్పొరేటర్	1
సీపీఎం కార్పొరేటర్	1

వైసీపీకి చెందిన మరొకరు బీజేపీలో చేరిపోయారు. దీంతో కౌన్సిల్‌లో కూటమి బలం 61కి పెరిగింది. వైసీపీ బలం 34కి తగ్గిపోయింది. వీరిలో కూడా మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీకి రాజీనామా చేయడంతో ఆయన కుమార్తె, ఐదో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక ఆ పార్టీతో అంటీముట్టనట్టే ఉంటున్నారు. అలాగే మరో నేత బెహరా భాస్కరరావు గత ... మిగతా 6వ పేజీలో

నేటి నుంచి ఇంటర్ సెకండియర్ తరగతులు

- 7వ తేదీ నుంచి ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు
- ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు



మద్దిలపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తరగతులు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 7వ తేదీ నుంచి ప్రథమ సంవత్సరం ప్రవేశాలు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులకు మేలు జరగనుంది. గత ఏడాది వరకు జూన్ 12న ఇంటర్ క్లాసులు ప్రారంభమయ్యేవి. ప్రైవేటు కళాశాలలు మాత్రం తమ ఉత్తీర్ణత శాతం పెంచుకోవడానికి ఏప్రిల్ నుంచే తరగతులు నిర్వహించేవి. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్పించుకునే ప్రయత్నాలు చేసేవి. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు తగ్గేవి. ఈ నేపథ్యంలో ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రవేశాలు, ఉత్తీర్ణత మెరుగుపరచడానికి ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తరగతులు, ప్రవేశాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలోని 27 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంగళవారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

ప్రతి విద్యార్థికి ఉచిత పుస్తకాలు

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ... మిగతా 6వ పేజీలో

పూర్తి జీతాలు అప్పుడే..

- 3వ బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభమయ్యేంత వరకూ కష్టాలు తప్పవన్న కేంద్ర ఉక్కు శాఖ సెక్రటరీ సందీప్ పాండే
- కాంట్రాక్ట్ సిబ్బందిని తగ్గించుకోవాలి
- ఎంపిక చేసిన ఉద్యోగులతో సమావేశం



విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో మూడో బ్లాస్ట్ ఫర్నేస్ కూడా పూర్తిస్థాయిలో పనిచేసినప్పుడే అందరికీ పూర్తి జీతాలు అందుతాయని, అంతవరకు కష్టాలు తప్పవని కేంద్ర ఉక్కు శాఖ సెక్రటరీ సందీప్ పాండే స్పష్టంచేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం ఎంపిక చేసిన సుమారు 200 మంది ఉక్కు యువ ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్లు అంతా వీఆర్‌ఎస్ తీసుకొని వెళ్లిపోతున్నారని, ప్లాంటును నడిపే బాధ్యత యువ ఉద్యోగులపైనే ఉందని స్పష్టంచేశారు. కాంట్రాక్టు సిబ్బంది ఎక్కువ సంఖ్యలో ఉంటే శాశ్వత ఉద్యోగులు సరిగ్గా పనిచేయరని, అందుకని ఎంత అవసరమో అంతే కాంట్రాక్ట్ సిబ్బంది ఉంటారని, మిగిలిన వారిని తీసేస్తామని పరోక్షంగా వెల్లడించారు. ఏ విభాగానికి ఆ విభాగం వారు అది తమ సొంత ఆస్తిలా భావించి నిర్వహణ పనులు చూసుకోవాలని, పూర్తి ఉత్పత్తి సాధించాలని సూచించారు. ఎవరైతే పనిచేయరో వారిని తొలగించాలని స్పష్టంచేశారు. ఒడిశాలోని డోల్వీలో జిందాల్ స్టీల్ కంపెనీ (ప్రైవేటు సంస్థ) 13 వేల మందితో పది మిలియన్ టన్నులు ఉత్పత్తి చేస్తోందని, దానిని ఆదర్శంగా తీసుకొని పని చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్‌తో పోల్చుకోవద్దని హితవు పలికారు. మే నెల నుంచి మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌లో పనిచేసే ... మిగతా 6వ పేజీలో

స్టీల్ ప్లాంటులో 1,213 మంది పదవీ విరమణ

- 1,130 మందికి వీఆర్ఎస్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో సోమవారం 1,213 మంది పదవీ విరమణ చేశారు. వీరిలో 1124 మంది స్వచ్ఛంద పదవీ విరమణ చేసినవారు ఉన్నారు. వీఆర్‌ఎస్ తీసుకున్న వారికి మొత్తం రూ.462 కోట్లు బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఇంకా వారికి ఆర్జిత సెలవులు, ప్రావిడెండ్ ఫండ్ వంటివి చెల్లించాల్సి ఉంది. పీఎఫ్ ట్రస్ట్‌కు మరో రూ.382 కోట్లు జమ చేసినట్టు సమాచారం. వారం, పది రోజుల్లో ఆర్జిత సెలవుల మొత్తాన్ని అందజేయనున్నారు. ఇదిలావుండగా ఉక్కు ఉద్యోగులకు మాత్రం మార్చి నెల జీతం ఇవ్వలేదు. దీంతో కలుపుకొని వారికి మొత్తం మూడు నెలల జీతం బకాయి ఉంది.

రోడ్డునపడ్డ 1,000 మంది కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను తగ్గించాలని యాజమాన్యం పట్టుదలగా ఉంది. నేరుగా తీసేస్తే ఇబ్బందులు వస్తున్నాయని, కాంట్రాక్టర్లను పిలిచి సిబ్బందిని తగ్గించుకోవాలని ఆదేశించింది. దాంతో 38 కాంట్రాక్ట్ సంస్థలు 248 మందిని తీసేశాయి. ఇది జరిగి పది రోజులైంది. దీనిపై కార్మిక సంఘాలు ఆందోళనకు దిగాయి. తాజాగా 55 ఏళ్లు దాటిన వారంతా స్టీల్ జనరల్ ఆస్పత్రికి వెళ్లి మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించింది. అలా వెళ్లని మరో 45 మంది పాస్‌లను నిలిపివేసింది. ఇంకో వైపు కాంట్రాక్టు పూర్తయిన వారికి రెన్యువల్ చేయకపోవడంతో వారి వద్ద పనిచేస్తున్న 700 మందికి ఉపాధి లేకుండా పోయింది. మొత్తంగా చూసుకుంటే ఈ నెల రోజుల వ్యవధిలో సుమారుగా వేయిమంది కాంట్రాక్టు కార్మికులపై వేటు వేసింది.

లక్షల వ్యయం..నిర్వహణ దారుణం

- జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం ఫలితం
- రోడ్ల సెంటర్ మీడియన్లలో ఎండిపోయిన మొక్కలు




విజేత సూపర్ మార్కెట్ నుంచి సాంకేతిక కళాశాల రోడ్డులో ఎండిపోయిన మొక్కలు

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల లక్షలాది రూపాయల ప్రజాధనం వృథావుతోంది. నగర సుందరీకరణతో పాటు కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా రోడ్లకి ఇరువైపులా మొక్కలు పెంచడం, సెంటర్ మీడియన్లలో అందమైన పూల మొక్కలను జీవీఎంసీ నాటుతోంది. వీటికి నిరంతరం నీరు పోయడంతో పాటు కలుపు తీసి ఏపుగా పెంచడం, ట్రిమ్మింగ్ చేయడం కోసం హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో ఏటా భారీగా నిధులు వెచ్చిస్తోంది. అందులో భాగంగానే మధురవాడలో బక్కన్నపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో విజేత సూపర్‌మార్కెట్ నుంచి సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలకు వెళ్లే వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణంతో పాటు సెంటర్ మీడియన్‌లో అందమైన మొక్కలు నాటారు. రోడ్డుపై వెళ్లేవారికి ఇక్కడి పచ్చదనం కనువిందు చేసేది. అయితే మొక్కల నిర్వహణపై శ్రద్ధ చూపాల్సిన అధికారులు ఆ విషయాన్ని మరిచారు. ఇంతవరకు పెద్దగా ఎండలు లేకపోవడంతో మొక్కలు వాటికవే పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం వేసవి కావడంతో సెంటర్ మీడియన్‌లోని మొక్కలకు నీళ్లు పోసే వారు లేక ఎండిపోయి కళావిహీనంగా కనిపిస్తున్నాయి. మరికొద్దిరోజులు ఇదే పరిస్థితి కొనసాగితే సెంటర్ మీడియన్‌లో నాటిన మొక్కలన్నీ చనిపోవడం ఖాయం. ఈ విషయాన్ని జీవీఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారుల వద్ద ప్రస్తావించగా, ఆ రోడ్డులో సెంటర్ మీడియన్ నిర్వహణ ఇప్పటికీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలోనే ఉందని తెలిపారు. అదే విషయాన్ని ఇంజనీరింగ్ అధికారుల వద్ద ప్రస్తావిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. ఇప్పటికైనా రెండు శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, పచ్చదనాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



రాజగోపాల్‌కు పురస్కారం ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అర్చకుడు రాజగోపాల్‌కు ఉగాది పురస్కారం

సింహాచలం/సాగర్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకుడు బీహెచ్ రాజగోపాల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారంతో సత్కరించింది. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు ఆయన్ను శాలువతో సత్కరించి, ప్రశంసాపత్రం అందించారు. రాజగోపాల్‌ను దేవస్థానం అధికారులు, వైదిక సిబ్బంది అభినందించారు. అలాగే గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ సభ్యురాలు డాక్టర్ మాల్యాదకు కూడా ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం లభించింది. భారతీయ సాంస్కృతిక కళల్లో ఆమె కూచిపూడి నృత్యంలో చేస్తున్న కృషికి గాను ఈ పురస్కారం అందించింది.

సింహగిరిపై ఈనెలలో జరిగే ఉత్సవాలు

సింహాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈ నెలలో (చైత్ర మాసం) పలు ఉత్సవాలు జరగనున్నాయి. దేవస్థానం ప్రకటించిన పంచాంగం ప్రకారం 3న రోహిణీ నక్షత్రం పురస్కరించుకుని మాధవధారలోని రుక్మిణీ వేణుగోపాల స్వామి సన్నిధిలో అష్టాక్షరీ హవనం, 5న ఆర్ద్ర ఎంబెరుమన్నార్ మాస తిరు నక్షత్రం, 6న నవమి తిథిన అప్పన్న ఆలయంలో రామాయణ పట్టాభిషేక విన్నపం జరగనున్నాయి. అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవాలు పురస్కరించుకుని 7న దశమినాడు మృత్స గ్రహణం, అంకురారోపణం, 8న సాయంత్రం 4 గంటలకు కొట్నాల ఉత్సవం, ధ్వజారోహణం, ఎదురుసన్నాహం, రథోత్సవం, వార్షిక తిరు కల్యాణ మహోత్సవం, 10న ఉదయం వైదిక సదస్యం, సాయంత్రం పండిత సదస్యం తరువాత సర్వజన మనోరంజిని వాహనంపై సింహగిరి మాడవీధుల్లో తిరువీధి, పుబ్బ నక్షత్రం ఆండాళ్ తిరు నక్షత్ర పూజలు, 11న స్వామివారి మాస తిరు నక్షత్ర పూజలు, సాయంత్రం సూర్యప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవం, 12న పూర్ణిమ అవభృదోత్సవం, చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి మృగయోత్సవం (దొంగల దోపు), 13న వినోదోత్సవం (ఉంగరపు సేవ), రాత్రి పుష్పయాగం, 14న మేష సంక్రమణం, 15న విశాఖ నక్షత్రం మనవాళ్ల తిరు నక్షత్ర పూజలు, 22న శ్రవణం నక్షత్రం పురస్కరించుకుని కొండదిగువ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సుదర్శన హవనం, 24న చైత్రమాస బహుళ ఏకాదశి చందన తొలిసాన సుమూహర్తం, 27న గంధం అమావాస్య, 28న భగవద్రామానుజాచార్యుల తిరునక్షత్రం, 29న మూలవిరాట్ కళావాహనం, 30న వైశాఖమాస శుక్లపక్ష తృతీయ అప్పన్న నిజరూప దర్శనం చందనయాత్ర, రాత్రి సహస్ర ఘటాభిషేకం, తరువాత మొదటి విడత చందన సమర్పణ జరగనున్నాయి. ఈమేరకు అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రియుడిపై కోపంతోనే అతని వాహనానికి నిప్పు

13 వాహనాల దగ్ధం కేసులో ప్రియురాలి అరెస్టు

మహారాణిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సింగ్ హోటల్ డౌన్ విశ్వనాథం రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మార్చి 29న 13 వాహనాలు దగ్ధం కావడానికి కారకురాలుగా భావిస్తున్న ఓ మహిళను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రియుడు తనను నిర్లక్ష్యం చేస్తున్నాడన్న కోపంతో అతడు కొత్తగా కొనుగోలు చేసి పార్కింగ్‌లో పెట్టిన వాహనానికి ఆమె నిప్పు పెట్టడంతో చుట్టూ ఉన్న ద్విచక్ర వాహనాలకు సైతం మంటలు అంటుకుని కాలి బూడిదయ్యాయని ఈస్టు ఏసీపీ కె. లక్ష్మణమూర్తి తెలిపారు. టూటౌన్ పోలీసు స్టేషన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిస్తూ ఈ ఘటనలో బర్మా క్యాంప్‌నకు చెందిన కలిగోట్ల కరుణ (27) అనే మహిళను అరెస్టు చేశామన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథం రోడ్డులో ఇటీవల నిర్మించిన అపార్టుమెంట్‌లో గువ్వల భరత్‌కుమార్ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు.బర్మా క్యాంప్ ప్రాంతానికి చెందిన కలిగోట్ల కరుణను గతంలో ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో సంబంధం కొనసాగించాడు. కొంతకాలంగా భరత్ ఆమెను అలక్ష్యం చేస్తూ దూరంగా ఉండసాగాడు. పెళ్లి చేసుకుంటానని తనను నమ్మించి మోసగించాడని భరత్‌పై ఆమె కక్ష పెంచుకుంది. అతడి వాహనంపై తాను తిరగవలసి ఉండగా, అతని భార్య వెళ్తోందని ఉక్రోషం పట్టలేక మార్చి 29 తెల్లవారు జామున సుమారు నాలుగున్నర గంటల సమయంలో భరత్ ఉంటున్న అపార్టుమెంట్ వద్దకు కరుణ వెళ్లింది. అతడు కొత్తగా ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి ఉగాది రోజు ప్రారంభిద్దామని అనుకుని దానిపై కవర్ వేసి పెట్టుకున్నాడు. కరుణ అగ్గిపుల్లతో ఆ కవర్‌కు నిప్పు అంటించడంతో క్షణాల్లో మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో అతని వాహనంతో పాటు సెల్లార్ పార్కింగ్‌లో ఉన్న మొత్తం 13 వాహనాలు పూర్తిగా ఆహుతి కాగా, బయట ఉన్న మరో 5 వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు, ఎస్‌ఐ సతీష్‌లు సుమారు 12 గంటల వ్యవధిలో కేసు ఛేదించి నిందితురాలు కరుణను అరెస్టు చేశారని ఏసీపీ లక్ష్మణమూర్తి వివరించారు.



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి, షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

భక్తులకు రక్షణగా...



రోడ్డుపై వేసిన కార్పెట్

సింహాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న దర్శనానికి వచ్చే భక్తులు ఎండ తీవ్రతకు ఇబ్బంది పడకుండా మాడవీధుల్లో అధికారులు రెడ్ కార్పెట్స్‌తో పాటు కూల్ పెయింట్ వేయించారు. సూర్యతాపం నుంచి ఇవి భక్తులకు ఉపశమనం కలిగిస్తున్నాయి.

సీపీఎం జెండా ఆవిష్కరణ

మధురవాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై పోరాటమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్ అన్నారు. తమిళనాడులో మంగళవారం నుంచి 6వ తేదీ వరకు జరగనున్న సీపీఎం జాతీయ మహాసభల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం మధురవాడ డైలీ మార్కెట్ సమీపంలో పతాకావిష్కరణ చేశారు.ఈ సందర్భంగా కుమార్ మాటాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సామాన్యులను అనేక విధాలుగా దోపిడీ చేసి, కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్నాయని విమర్శించారు. విద్య, వైద్యం క్రమంగా ప్రైవేటుపరం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.పార్టీ పతాకావిష్కరణకు ముందు నాయకులు సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డి. అప్పలరాజు, భారతి, పైడితల్లి, రాజశేఖర్, కిరణ్, కొండమ్మ, పద్మ, పాల్గొన్నారు.

సాగర దుర్గమ్మకు పూజలు

పద్మనాభం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో ఉన్న సాగర దుర్గమ్మను తహసీల్దారు కె. ఆనందరావు సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు సీతారాము ఆయనతో అమ్మవారికి విశేష అర్చనలు జరిపించారు.

ఆర్థిక శక్తిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. విశాఖపట్నానికి మౌలిక వసతులు కల్పించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని, పర్యాటక అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడుతో పాటు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. పర్యాటకం, ఇన్నోవేషన్ హబ్‌గా నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ ప్రజలు ఎప్పుడూ తెలుగుదేశం వెంట అండగా ఉన్నారని, పార్టీకి ఈ జిల్లా కంచుకోట అని చెప్పారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతా ఎదురుగాలి వీచినా విశాఖప్రజలు మాత్రం టీడీపీకే పట్టం కట్టారని గుర్తు చేసుకున్నారు.



హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

నూకాలమ్మ ఉత్సవ ఆదాయం లెక్కింపు

భీమునిపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నూకాలమ్మ ఉత్సవం ఆదాయాన్ని సోమవారం లెక్కించారు.నాలుగు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవం ద్వారా అమ్మవారికి రూ. 12.90 లక్షల ఆదాయం లభించింది. ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మంగిపూడి శ్రీధర్ పర్యవేక్షణలో ఈఓ బొంగరాల మురళీమోహన్ ఆధ్వర్యంలో ఈ లెక్కింపు చేపట్టారు. దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 6,91,730 లక్షల, హుండీల ద్వారా రూ. 5,99,012 లక్షల ఆదాయం లభించింది. గత ఏడాది టిక్కెట్ల ద్వారా రూ. 5,88,300 లక్షలు, హుండీల ద్వారా రూ. 4,81,336 లక్షలు ఆదాయం వచ్చింది. ఈ సారి అధికంగా రూ. 2,21,106 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. ఆదాయాన్ని నగరానికి చెందిన శ్రీసేవా సత్సంగ్ సభ్యులు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి చౌదరి సత్యరాజ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు, ప్రధాన కార్యదర్శి యెచ్చర్ల హరి, కోశాధికారి పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాసి వినోద్‌కుమార్, కోఆర్డినేటర్ గొరపల్లి సన్యాసిరావు, పట్టణ ప్రముఖులు గంటా నూకరాజు, అల్లిపిల్లి నరసింగరావు, మైలపల్లి లక్ష్మణరావు, కదిరి జగన్నాథం, నాగిరెడ్డి వెంకటస్వామి చెల్లూరి గౌరినాయుడు పాల్గొన్నారు.

దర్శనాలకు భక్తుల క్యూ

అమ్మవారి దర్శనానికి భక్తులు సోమవారం కూడా అధికంగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది. ఉత్సవాలు ఆదివారంతో ముగిసినప్పటికీ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



భీమిలిలోని ఈద్గా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో రంజాన్

భీమునిపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. నెల రోజులు ఉపవాస దీక్షలు, నమాజ్‌లు చేసిన తర్వాత సోమవారం ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజ్‌లు ఆచరించారు. ఈ సందర్భంగా భీమిలి జామియా మసీదు ఇమామ్ ఎండీ నసీమ్ రంజాన్ పర్వదినం విశిష్టతను బోధించారు. ఈ కార్యక్రమంలో మసీదు పెద్దలు షేక్ అన్వర్ హుస్సేన్, షేక్ అబ్దుల్ నయీమ్, షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : అనంతవరంలో ముస్లింలు రంజాన్ పురస్కరించుకుని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 30 రోజుల పాటు ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టి, దైవ చింతనతో గడిపారు. సోమవారం రంజాన్ మాసం ముగింపుగా ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని భక్తితో నిర్వహించారు. ఉదయాన్నే మసీదుకు చేరుకుని ముస్లిం వజూ నిర్వహించారు. అనంతరం సామూహిక ప్రార్థనలు చేశారు. తరువాత మత గురువు ద్వా ప్రసంగం తరువాత అల్లాను దువా చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

కొమ్మాది : పీఎంపాలెంలోని ఆర్‌హెచ్ కాలనీలో ఉన్న మసీద్‌లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు ముస్లింలతో నమాజ్ చేయించి, బయాన్ చెప్పారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు హాజీ షేక్ సుభానీ, ఎస్‌డీ సలార్ ఉద్దీన్, ఎస్‌డీ రసియాన్, తదితరులు పాల్గొన్నారు.

బ్రేకుల్లేని భారీ వాహనాలు!

... 5వ పేజీ తరువాయి

కొన్ని ఆంక్షలు విధించారు. అయితే భారీ వాహనాల నిర్వాహకులు, కొంతమంది వ్యాపారులు తమ స్వలాభం కోసం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. కొన్నాళ్ల కిందట కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఒక ద్విచక్ర వాహనాన్ని భారీ లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల వెంకోజీపాలెం జంక్షన్ వద్ద భారీ లారీ ఒకటి రద్దీగా ఉన్న సమయంలో ముందు వెళుతున్న కారును ఢీకొంది. దీంతో కారు రోడ్డుపైనే బోల్తాపడింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా సరే పోలీసులు, రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంకోజీపాలెం జంక్షన్ వద్ద కారును ఢీకొట్టిన లారీని పోలీసులు ఎంవీపీ స్టేషన్‌కు తీసుకువెళ్లి రెండు రోజులు ఉంచారు. తర్వాత రవాణా శాఖ అధికారుల సర్టిఫికెట్‌తో స్టేషన్ నుంచి లారీని నిర్వాహకుడు విడిపించుకుని తీసుకువెళ్లిపోయారు. అయితే లారీని నిర్వహిస్తున్న నగరానికి చెందిన ఒక పెట్రోల్ బంకు నిర్వాహకుడు 'ఏదో ప్రమాదం జరిగితే పోలీసులు, రవాణా శాఖ అధికారులకు డబ్బులు ఇచ్చి వాహనం తీసుకువెళ్లిపోతాం. కాకపోతే ఇప్పుడు లారీల ప్రవేశంపై ఆంక్షల పేరుతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు రెట్టింపు మొత్తాన్ని తీసుకున్నారు' అని చెబుతున్నారు.

ఇప్పటికైనా రవాణా, పోలీసు అధికారులు నగరంలో రోడ్డు ప్రమాదాలకు కారణంగా మారుతున్న భారీ లారీల ప్రవేశంపై నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంది.

నేటి నుంచి కేజీహెచ్‌లో ప్రతిరోజూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

... 5వ పేజీ తరువాయి

అందిస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అన్ని పని దినాల్లో ఈ సేవలు అందించనున్నారు. అలాగే, కార్డియాలజీ, కార్డియో థొరాసిక్, ప్లాస్టిక్ సర్జరీ, మెడికల్ అంకాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ అంకాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అనంతరం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల ఓపీ సేవలు అందించనున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ఈ మార్పులు చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషాలిటీ వైద్యులను నిత్యం రోగులకు అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు.

నూతన విద్యా విధానంపై అవగాహన

ఎండాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) :కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న నూతన విద్యా విధానంపై ఎండాడలోని సెలబ్రిటీ టవర్స్‌లో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సత్యసాయి స్కూల్ ఫెసిలిటేటర్ అరవింద మాట్లాడుతూ ఏడేళ్ల నుంచి 17 ఏళ్ల వరకూ ఉన్న విద్యార్థులు యాక్టివిటీ బేస్ ఎడ్యుకేషన్‌లో అవకాశాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రమీలా రాజీవ్, మహాలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టు కార్డుల వినియోగం



పోస్టు కార్డులను వినియోగిస్తున్న సిబ్బంది

సింహాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికత వినియోగం అధికంగా పెరుగుతున్న ఈరోజుల్లో కూడా సింహాచలం దేవస్థానం అధికారులు ఇప్పటికీ పోస్టు కార్డులు వినియోగిస్తున్నారు. ఆలయంలో జరిగే పలు ఆర్జిత సేవలకు, దీర్ఘకాల వ్యవధికి సంబంధించిన సొమ్మును ముందుగా చెల్లించిన వారు తాము చేయించుకోవలసిన సేవల తేదీలను పోస్టు కార్డుల ద్వారా తెలియజేస్తున్నారు.

సోమేశ్‌కు డాక్టరేట్

విశాలాక్షినగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని డే స్ప్రింగ్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ టెక్సస్‌కి చెందిన విశ్వవిద్యాలయం ప్రతినిధులు విశాలాక్షినగర్‌కి చెందిన బైపల్లి సోమేశ్‌ను సోమవారం సత్కరించి, గౌరవ డాక్టరేట్ అందించారు. సోమేశ్ 27 ఏళ్లుగా అయ్యప్పమాల ధరిస్తూ శ్రీరామ అయ్యప్ప అన్నదానం ట్రస్టు పేరుతో కార్తీక మాసంలో ప్రతిరోజూ స్థానిక భక్తతుకారం రామాలయంలో రెండు వేల మందికి అన్నదానం చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి వర్సిటీ అధికారులు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు.

గ్రేటర్ రికార్డు

... 5వ పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పన్ను బకాయిలు వసూలయ్యేందుకు దోహదపడింది. వీటన్నింటి కారణంగా ఈ ఏడాది రూ.510 కోట్లకుపైగా పన్ను వసూలైంది. రికార్డు స్థాయిలో పన్నులు వసూలుకావడం ఆనందంగా ఉందని, దీనికి జిల్లా కలెక్టర్, డీసీఆర్, జోనల్ కమిషనర్లతోపాటు రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది కృషి కారణమని అదనపు కమిషనర్ సోమన్నారాయణ ఆనందం వ్యక్తంచేశారు.

పూర్తి జీతాలు అప్పుడే...

... 5వ పేజీ తరువాయి

అవకాశం ఉందని, అందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

యూనియన్ నాయకులను దూరంగా పెట్టి...

సాధారణంగా స్టీల్ ప్లాంటుకు ఢిల్లీ నుంచి ఎవరైనా పెద్దలు వచ్చి పరిపాలన, ఉత్పత్తి పరమైన అంశాలు చెప్పాలనుకున్నప్పుడు ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. కానీ స్టీల్ సెక్రటరీ వారితో కాకుండా కేవలం జూనియర్, యువ ఉద్యోగులతో సమావేశమయ్యారు. దీనిని యూనియన్లు తప్పుబడుతున్నాయి. సమస్యలు చెబుతామని, వాస్తవ పరిస్థితి వివరించి, ఎదురు ప్రశ్నిస్తామనే ఉద్దేశంతో తమను పిలవలేదని ఆరోపిస్తున్నారు. యువ ఉద్యోగులైతే ఎదురు ప్రశ్నించరని, ఎవరైనా మాట్లాడితే వారిని వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని, ఆ కారణంతో వారితోనే సమావేశం నిర్వహించారని విమర్శిస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ సెకండియర్ తరగతులు

... 5వ పేజీ తరువాయి

పేరిట ప్రభుత్వం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయనుంది. ఇప్పటికే ఆర్ఐఓ కార్యాలయానికి 83,220 నోటు పుస్తకాలు చేరుకున్నాయి. వీటిని జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 3 కేజీబీవీ కళాశాలలు, 9 జడ్పీ మోడల్ హైస్కూళ్లకు పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది నుంచి పాఠ్య పుస్తకాలు కూడా మారుతున్నందున త్వరలో అవి కూడా వస్తాయని అధికారులు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కనీసం పాఠ్య పుస్తకాలు కూడా పంపిణీ చేయలేదు. గత ఏడాది కొత్త ప్రభుత్వం ఏర్పడడంతోనే ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది తరగతుల ప్రారంభానికి ముందే పుస్తకాలు పంపిణీకి సిద్ధం చేశారు.

పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్

... 5వ పేజీ తరువాయి

చదువుకున్న సౌజన్య అనే యువతి మంత్రి లోకేశ్‌ను కలిసి తనకు ఉద్యోగం కల్పించాలని కోరింది. కాగా సోమవారం ఉదయం లోకేశ్‌ను ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

మహో ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

కొంతకాలంగా వైసీపీకి దూరంగా ఉంటున్నారు. దీంతో కార్పొరేటర్లుగా ఉన్న ఆయన భార్య, కోడలు కూడా వైసీపీకి దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ బలం 31కే పరిమితం అయిందని చెప్పుకోవాలి. కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గిపోవడం, తమ బలం పెరగడంతో కూటమి నేతలు మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ మార్చి 21న ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. మేయర్‌పై అవిశ్వాసం నెగ్గాలంటే కౌన్సిల్‌లో ఓటుహక్కు కలిగిన సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు మద్దతు ఉండాలి. అంటే జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉండగా, జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు ఎనిమిది మంది, ఎంపీలు ఇద్దరు, రాజ్యసభ సభ్యుడు ఒకరు, ఎమ్మెల్సీలు నలుగురు మొత్తం 14 మంది ఓటు హక్కు కలిగిన ఎక్స్‌అఫిషియో సభ్యులు ఉన్నారు. వీరితో కలుపుకుంటే మొత్తం 111 మందిలో 74 మంది అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో పరిశీలిస్తే టీడీపీకి 48 మంది కార్పొరేటర్లు, జనసేనకు 11 మంది, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్ల బలం ఉంది. వీరుకాకుండా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ కలుపుకుంటే 72 మంది బలం ఉంది. అవిశ్వాసం నెగ్గాలంటే మరో ఇద్దరు సభ్యుల మద్దతు అవసరం. వారిద్దరినీ తమవైపు లాగడం కోసం కూటమి నేతలు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. వైసీపీ పట్ల అసంతృప్తితో ఉన్న ముత్తంశెట్టి ప్రియాంకతోపాటు బెహరా భాస్కరరావు కుటుంబంలో ఉన్న ఇద్దరు కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేస్తే మ్యాజిక్ ఫిగర్‌ను దాటవచ్చునని భావిస్తున్నారు. సీపీఐ సభ్యుడు ఏజే స్టాలిన్‌తోపాటు వైసీపీకి చెందిన మరికొందరు తమకు అనుకూలంగా ఓటువేస్తారని కూటమి నేతలు విశ్వాసంతో ఉన్నారు. దీనివల్ల ఎలాగైనా అవిశ్వాసం నెగ్గుతుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

అవిశ్వాసం వీగిపోయేలా చేసేందుకు వైసీపీ ఆరాటం

కూటమి నేతలు మేయర్‌పై ఇచ్చిన అవిశ్వాసతీర్మానం వీగిపోయేలా చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. అందుకోసమే తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లను వారం కిందట బెంగళూరు క్యాంపునకు తరలించారు. అయితే అక్కడకు కేవలం 28 మంది మాత్రమే వెళ్లారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు వంశీరెడ్డి, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఐదో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంకతోపాటు బెహరా భాస్కరరావు కుటుంబసభ్యులు ఇద్దరు క్యాంపునకు వెళ్లకుండా నగరంలోనే ఉండిపోయారు. వ్యక్తిగత కారణాలతో సతీష్, రోహిణి రాలేదని చెబుతున్న వైసీపీ నేతలు...మిగిలిన ముగ్గురు గురించి మాత్రం మాట్లాడడం లేదు. ఇదిలావుంటే వైసీపీలో ఉన్న కొందరు తమకు అనుకూలంగా ఓటువేస్తారని కూటమి నేతలు చెబుతుంటే...కూటమి వైపు ఉన్న కార్పొరేటర్లలో కొందరు కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరవడం ద్వారా పరోక్షంగా తమకు సహకరిస్తారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. కూటమి కార్పొరేటర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసు ఆధారంగా మేయర్ బల నిరూపణకు ఏప్రిల్ 19న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. మంగళవారం దీనిపై అధికారికంగా ప్రకటన చేసి సభ్యులతోపాటు ఎక్స్‌అఫిషియో సభ్యులకు నోటీసులు అందజేయనున్నారు.

'వీసీ అందరికీ న్యాయం చేయాలి'

వెంకోజీపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఏయూ సీఏఎస్‌లో జరిగిన ప్రమోషన్లలో అందరికీ న్యాయం చేయాలని, అర్హత ఉండి మిగిలిన వారికి తక్షణమే మరో నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏయూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సురేష్ మీనన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏయూలో టైం అయినా కొనసాగుతున్న ఎడిటెడ్ ఫ్యాకల్టీని పంపించే విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై మౌనంగా ఉండటం ఎడిటెడ్ ఫ్యాకల్టీని కొనసాగించటానికి ఒక కారణమని తెలుస్తుందని, ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ పదవిని ప్రొఫెసర్ ప్రసన్నశ్రీకి రావలసి ఉన్నా ప్రొఫెసర్ కర్మాకర్‌ను నియమించినా మౌనంగా ఉండటం తెలిసిన విషయమేనన్నారు. ఖరగ్‌పూర్ ఐఐటీ నుంచి ఏయూకి వీసీగా వచ్చిన ప్రొఫెసర్ రాజశేఖర్ అందరికీ న్యాయం చేయాలని కోరారు.

అలరించిన రామ భజన

వెంకోజీపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాత వెంకోజీపాలెం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామ భజన ఆకట్టుకుంది. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు,సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూర్య అప్పారావు,ప్రధాన కార్యదర్శి బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శి కర్రి రవి, కోశాధికారి యల్లపు శ్రీన, ఇతర కార్యవర్గ సభ్యులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ రవికుమార్, జనసేన నాయకులు వీంకట పరదేశి నాయుడు, పాల్గొన్నారు.

ఘనంగా పందిరి రాట

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెదగదిలి కొండవాలు ప్రాంతంలోని ఈశ్వర దేవి నగర్‌లో సీతారామ కల్యాణ ఉత్సవం సందర్భంగా సోమవారం పందిరి రాట వేశారు. పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది.

మూలపాలెంలో...

ఎంవీపీ కాలనీ : మూలపాలెం గ్రామ పరిధిలోని సాగరతీరంలో ఉన్న సీతారామ సాగర లింగేశ్వర ఆలయం వద్ద సోమవారం శ్రీరామనవమి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఉత్సవ మూర్తులను తిరువూరులో ఊరేగింపు, 6న వంద మంది దంపతులతో సీతారామ కల్యాణం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు అధ్యక్షుడు పరదేశి తెలిపారు.

రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1.31 కోట్ల ఆదాయం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం సెలవైనప్పటికీ ప్రభుత్వం ఆదేశం మేరకు ఆర్థిక సంవత్సరం చివరిరోజు కావడంతో పనిచేసింది. జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 99 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా రూ.1.31 కోట్ల ఆదాయం వచ్చింది. ఒక్క మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారానే రూ.33 లక్షలు వచ్చినట్టు జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు తెలిపారు. ఉగాది రోజున అంటే ఆదివారం రూ.82 లక్షల ఆదాయం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు రోజులు పనిచేయడం వల్ల 146 రిజిస్ట్రేషన్లతో రూ.2.13 కోట్ల ఆదాయం సమకూరింది.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 22, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాల కూర 3, తోటకూర 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

తీరంలో బీచ్‌ల పునరుద్ధరణ

పోర్టు సహకారంతో డీసీఐ ద్వారా పనులు

బీచ్ రోడ్డు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తీరంలో బీచ్‌ల పునరుద్ధరణ పనులకు తవ్వకాల సంస్థ (డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) చర్యలు తీసుకోనుంది. విశాఖ పోర్టు ట్రస్ట్ (వీపీటీ) సహకారంతో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధులతో డీసీఐ ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ పనులను పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ ప్రారంభించనున్నారు. బీచ్ రోడ్డులోని వైఎంసీఏ కూడలి సమీపంలో ఈ కార్యక్రమం జరగనుంది. బీచ్ పునరుద్ధరణ ప్రాజెక్టును 30 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళిక చేశారు.


తీరంలో జరుగుతున్న డ్రెడ్జింగ్ పనులు

బీచ్‌ల ఏర్పాటుకు అవకాశం

సాధారణంగా తీరంలోని బీచ్‌ల వద్ద ఉన్న ఇసుక పలు కారణాలతో సముద్రంలోకి జారిపోతుంది. దీంతో తీరం కోతకు గురవుతుంది. సముద్రంలో అక్కడక్కడ ఇసుక మేటలు వేస్తుంది. తవ్వకాల ద్వారా బీచ్‌ను మళ్లీ పునరుద్ధరించనున్నారు. ప్రస్తుతం ఉన్న బీచ్‌లపై మరో పొరలా ఇసుకను నింపడం, కొత్త ప్రాంతాల్లో బీచ్‌ను ఏర్పాటు చేయడం వంటివి చేస్తారు. కోతకు గురైన చోట అధిక మొత్తంలో ఇసుక వేసి విశాలంగా ఏర్పాటు చేసేందుకు అవకాశముంది. ఇలా చేయడం వలన బీచ్‌ల పునరుద్ధరణ చేయడంతో పాటు సముద్రం లోపల భారీ నౌకల రాకపోకలకు అవకాశం పెరగనుంది. త్వరలో విశాఖ నగర పరిధిలోని బీచ్‌లను ఇసుక మేటలతో మరింత సుందరంగా తయారు చేసేందుకు అవకాశం కల్పిస్తుంది. జిల్లా యంత్రాంగం ప్రస్తుతం ఉన్న బీచ్‌లతోపాటు అదనంగా మరికొన్ని బీచ్‌లను ఏర్పాటు చేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో తీర ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇలా చేయడం వలన తీరం కోతకు గురవ్వకుండా రక్షించుకోవచ్చు.

ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం : సీపీఎం

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉధృత పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కె ఎస్వీ కుమార్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 2 నుంచి 6 వరకు తమిళనాడులోని మధురై పట్టణంలో జరుగుతున్న సీపీఎం అఖిల భారత 24వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ అన్ని శాఖలకు పార్టీ పిలుపునిచ్చిందన్నారు. ఇందులో భాగంగా సోమవారం 10వ వార్డు బీఎన్నార్‌నగర్ కాలనీలో పార్టీ పతాకావిష్కరణ చేశామన్నారు. విద్యుత్ సంస్కరణల పేరిట స్మార్ట్ మీటర్లు పెట్టడం, ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు అంటూ విని యోగదారులపై అధిక భారం మోపడం ఆపాలని ఈ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి. వెంకటరావు, డి.నాగరాజు, స్థానిక సంఘ నాయకులు ఎ.రమణ, జి. నాగరాజు, పి.మణి, కృష్ణవేణి, అన్నపూర్ణ, సీతాలక్ష్మి, చంద్రమౌళి, సూరిబాబు, సంగీతరాణి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భద్రావతి పూజా మహోత్సవం

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని 11వ వార్డు ఆరిలోవ 1వ సెక్టారు గాంధీనగర్‌లోని భక్త మార్కండేయ పద్మశాలి యువజన సేవా సంఘం ప్రతినిధి కాకి గంగరాజు ఆధ్వర్యంలో సోమవారం భావనారుషి, భద్రావతి పూజ ఘనంగా జరిగింది. ఆరిలోవ పరిసర ప్రాంతాల్లోని సుమారు వెయ్యిమంది పద్మశాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రావతి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కేటరింగ్ రాజు, పప్పు రాజారావు, కరణం వెంకటేశ్వరరావు, వానపల్లి ఈశ్వరరావు, తెడ్లపు వెంకటేశ్వరరావు, కొప్పల రమేష్, వానపల్లి గాయిత్రి, అయ్యంకల శ్రీనివాసరావు, కొప్పల రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు. అందరికీ అన్న ప్రసాదాలు వితరణ చేశారు.

పేద విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

వెంకోజీపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు వినాయకుడి గుడి వద్ద పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిలు, ఎరేజర్లు వంటి విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. దుర్గాసాయి శ్యాము నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పాల్గొన్నారు. వంద మంది విద్యార్థులు వీటిని పొందారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పేరిట విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.15 వేలు చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చి 9 నెలలు గడిచినా ఒక్కటీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే తల్లికి వందనం నిధులు విడుదల చేసి విద్యార్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాతలు కోట్ల శ్రీనివాసరావు, ఎస్.దుర్గాప్రసాద్, ఆర్.సాయి, వి. వికాస్‌శ్యాము తదితరులు పాల్గొన్నారు.

కేటుగాడు


అక్షయ్‌కుమార్

- అశ్లీల వీడియోలతో మహిళకు బ్లాక్ మెయిల్
- రూ. 4 కోట్లు నగదు, 800 గ్రాముల బంగారం కాజేసిన మోసగాడు
- సీపీని ఆశ్రయించిన బాధితురాలు
- త్రీటౌన్ పోలీసుల అదుపులో నిందితుడు

మద్దిలపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) :ఒక వ్యక్తి నుంచి వచ్చిన రాంగ్ ఫోన్ కాల్ మాట్లాడినందుకు ఓ మహిళ ఏకంగా రూ.4 కోట్లు నగదు, 800 గ్రాముల బంగారం పోగొట్టుకోవడమే కాకుండా పదేళ్లు అతనితో మానసిక నరకం అనుభవించింది. అయినా అతని వేధింపులు ఆగకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భార్యను కాపాడి విషయం తెలుసుకున్న భర్త గత నెల 23న నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో రెవెన్యూ కాలనీకి చెందిన బుర్లసంవర్తిపూరి అక్షయ్‌కుమార్ (39) రియల్ ఎస్టేట్ వ్యాపారి. అతను ఓ దంత వైద్యురాలిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.వారికి ఇద్దరు కుమార్తెలు. భర్త జులాయిగా తిరగడంతో భార్య విడాకులు తీసుకుంది. ఒక కుమార్తె అక్షయ్‌కుమార్ వద్ద, మరో కుమార్తె అతని భార్య వద్ద ఉంటున్నారు. 2014లో అతను ఆకతాయిగా ఓ ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. అది భీమవరంలో బంగారు ఆభరణల షోరూమ్ భార్యకు వెళ్లింది. ఫోన్ కాల్‌ను ఆమె మాట్లాడి రాంగ్ నంబర్ అని కట్ చేసినా.. మహిళ వాయిస్ విన్న అక్షయ్ పదే పదే ఫోన్ చేసి ఆమెకు మాయ మాటలు చెప్పి పరిచయం పెంచుకున్నాడు. అది కాస్తా స్నేహంగా మారడంతో వ్యక్తిగత విషయాలు కూడా మహిళ ఫోన్‌లో చెప్పడం, వాటిని రికార్డ్ చేసి బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. శారీరకంగా కలవడానికి ఒప్పుకోవాలని లేదంటే కాల్ రికార్డ్స్ భర్తకు పంపిస్తానని బెదిరించాడు. భర్తకు తెలిస్తే ఏమవుతుందన్న భయంతో అక్షయ్‌తో ఆమె శారీరకంగా కలవడానికి అంగీకరించింది. ఈమేరకు అక్షయ్ ఆమెతో శారీరకంగా కలిసి ఆమెకు తెలియకుండా అశ్లీల వీడియోను ఫోన్‌లో రికార్డ్ చేశాడు. ఆ వీడియోలతో నగదు కావాలని బ్లాక్ మెయిల్ చేశాడు. అక్షయ్ బ్లాక్ మెయిల్ చేసినప్పుడల్లా అతని యూనియన్ బ్యాంక్, కరూర్ వైశ్యబ్యాంక్ ఖాతాలకు రూ. 3 కోట్లకు పైగా నగదు బదిలీ చేసింది. అంతేకాకుండా 800 గ్రాముల బంగారం కూడా కాజేశాడు. భీమవరంలో ఆమె భర్తకు తెలిసిపోతుందని రెండుసార్లు విశాఖకు పిలిచి సీఎంఆర్ సెంట్రల్ ఎదురుగా ఒకసారి రూ.10 లక్షలు, మరోసారి రూ. 5 లక్షలు తీసుకున్నాడు. అంతటితో ఆపకుండా మళ్లీ మళ్లీ నగదు కావాలని బ్లాక్‌మెయిల్ చేశాడు. ఇక ఇవ్వడానికి ఆమె వద్ద నగదు లేకపోవడంతో భీమవరంలో ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. దీంతో అసలు విషయం తెలుసుకున్న ఆమె భర్త సీపీకి ఫిర్యాదు చేశాడు. త్రీ టౌన్ పోలీసులు అక్షయ్‌ను తిరుపతిలో అరెస్ట్ రిమాండ్‌కు పంపించారు. అతని వద్ద 75 గ్రాముల బంగారం, ఎస్ క్రాస్ కారును స్వాధీనం చేసుకున్నారు. అతని బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారు.

జనసేన సంస్థాగత నిర్మాణమే ప్రస్తుత లక్ష్యం

పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని పూర్తి సంస్థాగతంగా నిర్మించడమే ప్రస్తుత లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ పార్టీ నాయకులు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీతంపేటలోని జనసేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదకొండు ఏళ్లుగా ప్రజా సంక్షేమం,పేదరిక నిర్మూలన, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం, నవ సమాజ నిర్మాణమే ప్రధాన అంశాలుగా అధినేత పవన్ కల్యాణ్ నేతృత్వంలో పనిచేస్తున్నామన్నారు. పార్టీ అంచెలంచెలుగా ఎదిగి ఇప్పుడు 11.81 లక్షల మంది సభ్యులతో కళకళలాడుతోందన్నారు. పార్టీ జెండా మోసే కార్యకర్త కుటుంబానికి బీమా ద్వారా భరోసా కల్పించిన ఏకైక పార్టీగా జనసేన నిలిచిందన్నారు. ఏ అధికారం లేకుండా ఒక్క ఎమ్మెల్యే/ఎంపీ లేకుండా పార్టీని పదకొండేళ్లు నడపడం ఆషామాషీ కాదన్నారు. ఇప్పుడు బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణం జరుగుతోందన్నారు. విశాఖలో గత వైసీపీ పెద్దలు ప్రభుత్వ భూములు, పర్యాటక ఆస్తులను ఆక్రమించుకున్నారని, ఇలాంటి ఇబ్బందులను అధిగమించి, నగరాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం గట్టిగా పని చేస్తోందన్నారు. త్వరలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఛైర్మన్ టి. శివశంకరరావు, పార్టీ నాయకులు కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల. పక్కన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఛైర్మన్ శివశంకర్


శంకుస్థాపనలో పాల్గొన్న నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీభరత్, వరుణ్ గ్రూపు ఛైర్మన్ ప్రభు కిశోర్

దేశంలో ఐదో ఆర్థిక నగరంగా విశాఖ

ఐటీ మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖను దేశంలో ఐదవ ఆర్థిక నగరంగా అభివృద్ధి చేస్తామని ఐటీ శాఖా మంత్రి లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలో 'తాజ్-వరుణ్' గ్రూపు ఆధ్వర్యంలో 'వరుణ్ బే శాండ్స్' పేరుతో నిర్మించనున్న స్టార్ హోటల్, ఆఫీస్ టవర్లకు తల్లి భువనేశ్వరితో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని, ఇప్పుడు చంద్రబాబు 'బ్రాండ్' స్పష్టంగా కనిపించేలా పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రాజెక్టు ద్వారా రూ.500 కోట్ల సంయుక్త పెట్టుబడి రాష్ట్రానికి వస్తోందన్నారు. విశాఖలో ఐటీ ద్వారా ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, హోం మంత్రి అనిత, పౌర సరఫరాల శాఖా మంత్రి మనోహర్, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు ఎం. శ్రీభరత్, సీఎం రమేశ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు,వరుణ్ గ్రూపు ఛైర్మన్ ప్రభు కిశోర్, ఎండీ వరుణ్‌దేవ్, జేఎండీ వర్ష పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్



ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డు పరిధిలోని తోటగరువు సమీపంలో ఉన్న డెయిరీ ఫారం ఖాళీ స్థలంలో ముస్లింలు సోమవారం రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 వరకు ప్రార్థనలు చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

అలరించిన సంగీత కచేరీ

ఎంవీపీ కాలనీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లలిత సప్తస్వరాల బృందం ఆధ్వర్యంలో శ్రీరామదాసు కీర్తనలు, జయదేవుని అష్టపదులు, త్యాగరాజు కీర్తనలు ఆలపించారు. వీనుల విందుగా సాగిన కచేరీని భక్తులు ఆస్వాదించారు.

జెర్రిపోతులపాలెంలో పెద్దలకు ఇళ్లపై ఆరా

అక్రమార్కులపై చర్యలకు అధికారుల యోచన

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు ఇళ్ల మంజూరు వ్యవహారాన్ని హౌసింగ్ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీనికి సంబంధించి 'పేదల కాలనీలో పెద్దలకు ఇళ్లు' శీర్షికన మార్చి 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి హౌసింగ్ అధికారులు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మంజూరుకు సంబంధించి వివరాల కోసం పెందుర్తి తహసీల్దారు కార్యాలయం నుంచి సమాచారం తీసుకోవాలని యోచిస్తున్నారు. గ్రామంలో మొత్తం 134 మందికి వైసీపీ హయాంలో 1.5 సెంట్లు విస్తీర్ణంలో ప్లాట్లు వేసి, ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు మంజూరుచేశారు. సగానికిపైగా అనర్హులుండడంపై గత ఏడాది చివర్లో విచారణ చేపట్టారు. సుమారు 60 మంది అనర్హులున్నారని వీఆర్వో విచారణలో తేలగా ఈ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవడానికి రెవెన్యూ అధికారులు ముందుకురాలేదు. అయితే 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అనర్హులపై చర్యల కోసం కలెక్టర్ అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు.


కేంద్రకారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

సెంట్రల్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో ఖైదీలందరికీ ఉచిత న్యాయ సహాయం అందుతుందా? లేదా? అని జిల్లా ప్రధాన న్యామూర్తి ఆలపాటి గిరిధర్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఆయన సోమవారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో భాగంగా ఆయన ఖైదీలతో మాట్లాడారు. జైలులోని న్యాయ సహాయ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయం పై సమీక్షించారు. అనంతరం ఆయన ఖైదీలతో మాట్లాడుతూ వారి కేసుల వివరాలపై ఆరా తీశారు. జైలులో వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జైలులోని వివిధ బ్లాకులను ఆయన సందర్శించారు. అక్కడ పరిశుభ్రత పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు, ఉప పర్యవేక్షణాధికారులు జవహర్ బాబు, సాయి ప్రవీణ్, జైలర్లు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చందనోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఉత్సవ ముఖ్యఅధికారి భ్రమరాంబ


సమావేశంలో మాట్లాడుతున్న సీఎఫ్‌వో భ్రమరాంబ

సింహాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవానికి సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని చందనోత్సవ ముఖ్య అధికారి (ఆర్‌జేసీ) ధర్మముళ్ల భ్రమరాంబ కోరారు. ఈనెల 30న జరునున్న చందనోత్సవంపై ఈవో కె. సుబ్బారావుతో కలిసి సోమవారం సింహగిరిపై దేవస్థానం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామాన్య భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికలతో కృషి చేయాలన్నారు. క్యూలు, పార్కింగ్ స్థలాల ఏర్పాటుపై కార్యనిర్వాహక ఇంజనీర్లు దండు గణపతి శ్రీనివాసరాజు, బండారు రాంబాబు వివరించారు. లక్షన్నరకు పైగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లకు పూర్తిస్థాయిలో నీడ కల్పించాలని, భక్తులందరికీ తాగునీరు, మజ్జిగ అందేలా చూడాలన్నారు. భక్తుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, తాత్కాలిక మరుగుదొడ్లను సిద్ధం చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. ఉత్సవంలో స్వచ్ఛంద సంస్థల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఓ ఆనందకుమార్, పిళ్లా శ్రీనివాస్, డీఈఈ రామరాజు, పర్యవేక్షణాధికారులు రాజ్యలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, సత్యవాణి, గాయత్రి, శ్రీనివాస్, నరసింగరావు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌లో గుండెపోటుతో యువకుడి మృతి


పరదేశి (ఫైల్)

భీమునిపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల తన కుమారుడ్ని పట్టుకుని సరదాగా స్నేహితులతో కలిసి సముద్రంలో స్నానానికి దిగిన వ్యక్తి గుండె నొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద సంఘటన భీమిలి బీచ్‌లో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాలు ప్రకారం.. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన గెద్ద పరదేశి (37), అతని కుమారుడు శ్రీనివాస్ (5), స్నేహితులు బొల్లా సత్యనారాయణ (30), బొల్లా శంకర్ (29), వెంపల మణికంఠ (19)తో కలిసి రెండు బైకులతో సాయంత్రం 4 గంటలకు బీచ్‌కు వచ్చారు. మణికంఠ ఒడ్డున వుండగా, పరదేశి తన కుమారుడ్ని పట్టుకుని సముద్రంలో ఈతకు దిగాడు. ఆయనతో పాటు సత్యనారాయణ, శంకర్ కూడా దిగి ఈత కొడుతుండగా పరదేశికి ఆకస్మాత్తుగా గుండెలో తీవ్ర నొప్పి రావడంతో ఒడ్డుకు వచ్చేశాడు. శ్రీనును మణికంఠకు అప్పజెప్పి తనకు గుండెలో నొప్పి వస్తుందని, నీరసంగా వుందని చెబుతూ పక్కకు వాలిపోయాడు. వెంటనే స్నేహితులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా పరదేశి మరుపల్లిలో పాల కేంద్రాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు. అతనికి భార్య నిర్మల, కుమార్తె రిషిత, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి విశాఖవాసి మృతి

గొల్లప్రోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కూతురుకి పుట్టి వెంట్రుకలు తీయించేందుకు విజయవాడ కనక దుర్గమ్మ గుడికి వెళ్తూ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మరణించాడు. ఈ సంఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. విశాఖ నగరంలోని మర్రిపాలెం ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ (34) కూతురికి పుట్టి వెంట్రుకలు తీయించేందుకు విజయవాడ వెళ్లడానికి విశాఖ నుంచి హైదరాబాదు వెళ్లే వీక్లి సూపర్‌ఫాస్ట్ రైలులో కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం బయలుదేరారు. మధ్యాహ్నం భోజనం చేసి చేయి కడుక్కునేందుకు వాష్ బేసిన్ వద్దకు వెళ్లగా రైలు కుదుపులకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చేసరికి కిందకు జారిపడి మరణించాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. అనిల్‌కుమార్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తుని రైల్వే ఎస్ఐ జి. శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు భారీగా దరఖాస్తులు

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచితంగా ప్రాథమిక కుట్టు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా బీసీ సంక్షేమ శాఖ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించగా భారీ స్పందన వచ్చింది. బీసీ సంక్షేమశాఖ పరిధిలోని బీసీ, కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా ఆయా కులాల మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చేందుకు దర ఖాస్తులను ఆహ్వానించింది. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందించనున్నారు. ఇందుకోసం జిల్లాకు 3,596 యూనిట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. కాగా జిల్లా వ్యాప్తంగా 18,300కు పైగా దరఖా స్తులు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. వడపోత ప్రక్రియను రెండు రోజుల్లో చేపట్టనున్నారు. అర్హుల ఎంపికకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన తరువాత, ఎంపికైన వారికి 45 నుంచి 90 రోజుల పాటు శిక్షణ ఉంటుంది.

స్త్రీల రామాయణ పాటలు ఆసక్తికరం: మలయవాసిని


ప్రవచనమిస్తున్న మలయవాసిని

అక్కయ్యపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్రుల సందర్భంగా లలితానగర్‌లోని లలితా పీఠంలో రామాయణ ప్రవచనాలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. స్త్రీల రామాయణపు పాటల వైశిష్ట్యాన్ని, జానపద రామాయణాల విశేషాలను ఆచార్య కోలవెన్ను మలయవాసిని వివరించారు. రామాయణ గ్రంథాలలో లేని అనేక విషయాలు జానపద స్త్రీలు తమ ఆలోచనలు, నమ్మకాలకు అనుగుణంగా భావించి పాడుకుంటారని, ఈ కథలు చాలా ఆసక్తికరమేకాక పాడుకోవడానికి వీలుగా ఉంటాయని చెప్పారు. రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు వంటి పాత్రలను తమ కుటుంబ సభ్యులుగా భావించి ఆత్మీయంగా పాడుకుంటారని ఆమె వివరించారు. ప్రవచన కర్తను పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణసేన్ సత్కరించారు. ప్రవచనాలు నాలుగు రోజులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఇద్దరి ఉసురు తీసిన మద్యం

మహారాణిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మద్యం కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు వన్‌టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు. చిలకపేటకు చెందిన కనకమహాలక్ష్మి (20) తన భర్తతో నివాసం ఉంటోంది. భర్త నిత్యం మద్యం తాగి గొడవలు పడుతూ ఉన్నాడు. మద్యం మానేస్తానని చెప్పి కొన్నాళ్ల తరువాత తిరిగి తాగుతూ వేధించేవాడు. దీనితో మనస్తాపం చెందిన కనకమహాలక్ష్మి ఇంటిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మరో ఘటనలో కొత్త జాలారి పేటకు చెందిన బూతి వీరేంద్ర (32) నిత్యం మద్యం తాగుతూ సెల్‌ఫోన్ గేమ్స్ ఆడేవాడు. అతని కుటుంబ సభ్యులు మందలించడంతో మద్యం మత్తులో ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

శారదా నదిలో మునిగి యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న శారదా నదిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందిన సంఘటనపై ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి.. విశాఖపట్నం తాటిచెట్లపాలేనికి చెందిన షేక్ అబ్దుల్ (32) పెయింటింగ్ పనులు చేస్తుండేవాడు. ఏడాది క్రితం అనకాపల్లి వచ్చి పనులు చేసుకునేవాడు. ఆదివారం మధ్యాహ్నం నదిలోకి దిగిన ఆ యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందినట్టు చెప్పారు. దీనిపై అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి విచారణ జరపగా, నది ఒడ్డున లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అతడి వివరాలు గుర్తించామన్నారు. మృతుడి సోదరి షేక్ జినిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

యువత ఉపాధి కల్పనకు పవన్ తపన: మంత్రి నాదెండ్ల


/జనసేన కార్యాలయం వద్ద మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్వాగతం

సీతంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి కల్పించాలనే తపనతో ఉన్నారని త్వరలోనే భారీ పెట్టుబడులు వస్తాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన గ్రామాల్లో పర్యటించి రహదారులు వేయడం ద్వారా మార్పు తీసుకొచ్చారని అన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర జనసేన కార్యాలయంలో సోమవారం జీవీఎంసీ కార్పొరేటర్లతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ దీపం పథకం ద్వారా ఇప్పటి వరకు 99 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించామన్నారు. అధినేత పవన్ కల్యాణ్ అడుగు జాడలలో నడుస్తూ జనసేన గెలిచిన 21 నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఆవిర్భావ సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు తమ నాయకుని తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంకితభావంతో పని చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, రిజనల్ కో-ఆర్డినేటర్లు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖలో మార్పులు ప్రజలకు మేలు: కోసూరి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన నూతన మార్పుల కారణంగా ప్రజలకు మేలు చేకూరుతుందని బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోసూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నగరానికి వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. మంత్రి మనోహర్ స్పందిస్తూ జనసేన పార్టీ పటిష్టానికి ప్రతీ ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

స్పోర్ట్స్ లైబ్రరీ ప్రారంభం


బ్యాడ్మింటన్ అకాడమీలో సరదాగా ఆడుతున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో మెలకువలు, నైపుణ్యం, సాధన, నిబంధనలు, క్రమశిక్షణ వంటి అంశాలపై వర్ధమాన క్రీడాకారులలో అవగాహన కల్పించేందుకు లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీలో స్పోర్ట్స్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు, ఐటీ కమిషనర్ పద్మనాభన్ ముఖ్య అతిథులుగా హాజరై స్పోర్ట్స్ లైబ్రరీని, కొత్తగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. శిక్షణకు పిల్లలను తీసుకువచ్చే తల్లిదండ్రుల నిరీక్షణ విభాగాన్ని అతిథులు ప్రారంభించి, అకాడమీ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ ఆలోచనను అభినందించారు. మాజీ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు, కార్పొరేటర్ పి.ఉషశ్రీ, వైజాగ్ ప్రొఫైల్స్ సీఎండీ బండి సురేష్, వీపీపీఎల్ డైరక్టర్ కృష్ణారావు, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం


భద్రావతి దేవి, భవనా రుషి, కల్యాణం జరిపిస్తున్న ఆంజనేయ గురుస్వామి

సీతంపేట, మార్చి 31, (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లో భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భద్రావతి దేవి భావనా రుషి స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం గౌరవ అధ్యక్షుడు ఆమంచి అంజనేయ గురుస్వామి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను సీతంపేట పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుదే రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుదే త్రినాథ్, గౌరవ అధ్యక్షుడు గుదే వేణు, సంఘం ప్రతినిధులు వాసపల్లి గంగరాజు, పప్పు ప్రసాద్, ఈశ్వర్, ఆకుల శ్రీనివాస్‌రావు, బేత అప్పారావు, ఇమంది వీర్రాజు, లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

ప్రియుడిపై కోపంతో వాహనాలకు నిప్పు

నిందితురాలి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి

మహారాణిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథం రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మార్చి 29న 13 వాహనాలు దగ్ధం కావడానికి కారకురాలిగా భావిస్తున్న కలిగోట్ల కరుణ (27) అనే మహిళను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. ప్రియుడు తనను నిర్లక్ష్యం చేస్తున్నాడన్న కోపంతో అతడు కొత్తగా కొనుగోలు చేసి పార్కింగ్‌లో పెట్టిన వాహనానికి ఆమె నిప్పు పెట్టడంతో చుట్టూ ఉన్న మరో 12 ద్విచక్రవాహనాలకు సైతం మంటలు అంటుకుని కాలి బూడిదయ్యాయని చెప్పారు. టూటౌన్ పోలీసు స్టేషన్లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిస్తూ ఈ ఘటనలో నిందితురాలిది బర్మా క్యాంప్ అని తెలిపారు. విశ్వనాథం రోడ్డులో ఇటీవల నిర్మించిన అపార్టుమెంట్‌లో గువ్వల భరత్ కుమార్ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. కలిగోట్ల కరుణను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో సంబంధం కొనసాగించాడు. కొంతకాలంగా భరత్ ఆమెను అలక్ష్యం చేస్తూ దూరమయ్యాడు. తనను మోసగించడంతో భరత్‌పై ఆమె కక్ష పెంచుకుంది. అతడి వాహనంపై తాను తిరగవలసి ఉండగా, అతని భార్య వెళ్తోందని ఉక్రోషం పట్టలేక మార్చి 29 తెల్లవారుజామున భరత్ ఉంటున్న అపార్టుమెంట్ వద్దకు కరుణ వెళ్లింది. ఉగాది రోజు ప్రారంభిద్దామని అనుకుని కొత్త వాహనంపై కవర్ వేసి పెట్టుకున్నాడు. కరుణ అగ్గిపుల్లతో ఆ కవర్‌కు నిప్పు అంటించడంతో క్షణాల్లో మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో అతని వాహనం సహా సెల్లార్ పార్కింగ్‌లో ఉన్న మొత్తం 13 వాహనాలు పూర్తిగా ఆహుతి కాగా, బయట ఉన్న మరో 5 వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కాలిపోయిన సొత్తు విలువ రూ.19 లక్షలుగా ఆయన పేర్కొన్నారు. టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు, ఎస్ఐ సతీష్‌లు సుమారు 12 గంటల వ్యవధిలో కేసు ఛేదించి నిందితురాలు కరుణను అరెస్టు చేశారని ఏసీపీ లక్ష్మణమూర్తి వివరించారు.

15 ఏళ్లుగా భర్త కనిపించడం లేదని మహిళ ఫిర్యాదు


సురేష్ (ఫైల్)

కంచరపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త తిరిగి వస్తాడని ఎదురుచూసి రాకపోవడంతో భార్య కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కంచరపాలెం దరి ఐటీఐ జంక్షన్ సిద్దార్థనగర్‌కు చెందిన కోనేటి గంగాప్రియ (38) తల్లి వద్ద తన కుమారుడు, కుమార్తెతో నివాసం ఉంటోంది. సుమారు 15 ఏళ్ల క్రితం భర్త సురేష్, భార్య గంగాప్రియతో గొడవపడ్డాడు. ఆ సమయంలో సురేష్ అత్త కాలు విరిగిపోయింది. అప్పట్లో గంగాప్రియ పోలీసులకు ఫిర్యాదు చేస్తుందేమోనన్న భయంతో సురేష్ ఇంటికి చేరుకోలేదని గంగాప్రియ ఫిర్యాదులో పేర్కొంది. ఏ రోజైనా వస్తాడనే ఆశతో ఎదురుచూస్తున్న గంగాప్రియ ఇంతవరకు భర్త రాకపోవడంతో సోమవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదనపు ఎస్ఐ ఎం.రవిచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సమస్త మానవాళికి ఖురాన్ మార్గదర్శి


అక్కయ్యపాలెంలో సందేశమిస్తున్న నజీర్


వన్‌టౌన్‌లోని అబుసరంగ్ ఈద్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

డాబాగార్డెన్స్/మహారాణిపేట/మర్రిపాలెం/అల్లిపురం/అక్కయ్యపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పాత జైల్‌రోడ్డులోని విశాఖ సిటీసెంట్రల్ పార్కు వద్ద ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ముస్లిం సోదరులు, చిన్నారులు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. సర్వమానవ సౌభ్రాతృత్వం, ప్రపంచశాంతిని ఆకాంక్షిస్తూ సంప్రదాయ దుస్తుల్లో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హాజీ కాసి రజా మౌలానా మాట్లాడుతూ ఖురాన్ సమస్త మానవాళికి మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. ముస్లిం వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం అధ్యక్షుడు హైదర్ అలీ సింకా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటం ద్వారా ఆధ్యాత్మికమే కాకుండా ఎదుటివారి ఆకలి బాధను అర్థం చేసుకోగలమన్నారు. దీని కారణంగా ఎదుటివారిపై ప్రేమాభిమానాలు పెరుగుతాయన్నారు. రంజాన్ మాసంలో పేదలకు జకాత్, ఫిత్రా చెల్లిస్తారని, ఇలా చేయడం వలన పేదలు కూడా ఆనందంగా గుడుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ రహమతుల్లా, హాజీ ఎస్.కే.అహ్మద్‌వలి, రహమతుల్లాబేగ్, మక్బద్ అస్లం, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. వన్‌టౌన్‌లోని హాజీ అబుసరంగ్ ఈద్ దర్గాలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీద్ అధ్యక్షుడు మహ్మద్ నుస్రత్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఇమామ్ హఫీజ్ మహ్మద్ ముతీయూర్ రహమాన్ సారథ్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఖురాన్ పఠించారు. ప్రార్థనల అనంతరం మాట్లాడుతూ ప్రజలు కులమత భేదాలు లేకుండా పరస్పరం సహకరించుకుంటూ సోదరభావంతో కలసిమెలసి ఉండాలని ఉద్బోధించారు. కార్పొరేటర్ మహ్మద్ సాదిక్, మహిళలు సహా పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రార్థనలలో పాల్గొన్నారు. మర్రిపాలెం, జాకీర్‌హుస్సేన్‌నగర్‌లలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈద్గా వద్దకు చేరుకొని ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌ను ఆచరించారు. సమీపంలో ఉన్న బరేల్ గ్రౌండ్స్‌కు చేరుకొని పూర్వీకులకు ఆత్మశాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కయ్యపాలెంలోని 44వ వార్డు పెద్దూరు మసీదులో ఈద్ ఉల్ ఫితర్ వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, సలీం మహ్మద్ గౌస్ పాల్గొన్నారు. అల్లిపురంలోని యాతపేట, కోటవీధిలో ప్రార్థనలు చేశారు. పిల్లలు పెద్దల నుంచి ఈద్ (బహుమతులు) అందుకున్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన ద్రవ్యాన్ని దానం చేశారు.

'పార్కింగ్ ఉత్తర్వులు పక్కాగా అమలు చేయండి'

మహారాణిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య సముదాయాలలో వాహనాల పార్కింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 44ను మంగళవారం నుంచి పక్కాగా అమలు జరపాలని వినియోగదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు కోరారు. సోమవారం మహారాణిపేటలోని అఫీషియల్ కాలనీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాణిజ్య సంస్థలలో పార్కింగ్ వసూళ్ల వ్యవహారంపై గత అక్టోబరులో వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి చేసిన విన్నపాన్ని మన్నించి ప్రభుత్వం జీవోతోపాటు మార్గదర్శకాలను జారీ చేసిందని చెబుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వానికి తమ సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. వాణిజ్య సంస్థలు, మాల్స్, మల్టీప్లెక్స్‌లలో ఉత్తర్వుల అమలుపై పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ మూల వెంకటరావు, కరణం రెడ్డి నరసింగరావు, దీపక్ వర్మ, రాజా, సునీల్, లోగిన గణేష్, మూర్తి, ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నూతన కార్యవర్గం

సీతమ్మధార, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామాటాకీస్ రోడ్డు అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నికను సోమవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శిగా జె.వి.ప్రభాకర్, కోశాధికారిగా గార సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మద్ది అప్పలకొండ, అలమండ ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా బి.గౌతమ్ బాబు, పతివాడ రాంబాబు, మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

కొంతకాలంగా వైసీపీకి దూరంగా ఉంటున్నారు. దీంతో కార్పొరేటర్లుగా ఉన్న ఆయన భార్య, కోడలు కూడా వైసీపీకి దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ బలం 31కే పరిమితం అయిందని చెప్పుకోవాలి. కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గిపోవడం, తమ బలం పెరగడంతో కూటమి నేతలు మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ మార్చి 21న ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. మేయర్‌పై అవిశ్వాసం నెగ్గాలంటే కౌన్సిల్‌లో ఓటుహక్కు కలిగిన సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు మద్దతు ఉండాలి. అంటే జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉండగా, జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు ఎనిమిది మంది, ఎంపీలు ఇద్దరు, రాజ్యసభ సభ్యుడు ఒకరు, ఎమ్మెల్సీలు నలుగురు మొత్తం 14 మంది ఓటు హక్కు కలిగిన ఎక్స్‌అఫిషియో సభ్యులు ఉన్నారు. వీరితో కలుపుకుంటే మొత్తం 111 మందిలో 74 మంది అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో పరిశీలిస్తే టీడీపీకి 48 మంది కార్పొరేటర్లు, జనసేనకు 11 మంది, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్ల బలం ఉంది. వీరు కాకుండా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ కలుపుకుంటే 72 మంది బలం ఉంది. అవిశ్వాసం నెగ్గాలంటే మరో ఇద్దరు సభ్యుల మద్దతు అవసరం. వారిద్దరినీ తమవైపు లాగడం కోసం కూటమి నేతలు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. వైసీపీ పట్ల అసంతృప్తితో ఉన్న ముత్తంశెట్టి ప్రియాంకతోపాటు బెహరా భాస్కరరావు కుటుంబంలో ఉన్న ఇద్దరు కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేస్తే మ్యాజిక్ ఫిగర్‌ను దాటవచ్చునని భావిస్తున్నారు. సీపీఐ సభ్యుడు ఏజే స్టాలిన్‌తోపాటు వైసీపీకి చెందిన మరికొందరు తమకు అనుకూలంగా ఓటువేస్తారని కూటమి నేతలు విశ్వాసంతో ఉన్నారు. దీనివల్ల ఎలాగైనా అవిశ్వాసం నెగ్గుతుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

అవిశ్వాసం వీగిపోయేలా చేసేందుకు వైసీపీ ఆరాటం

కూటమి నేతలు మేయర్‌పై ఇచ్చిన అవిశ్వాసతీర్మానం వీగిపోయేలా చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. అందుకోసమే తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లను వారం కిందట బెంగళూరు క్యాంపునకు తరలించారు. అయితే అక్కడకు కేవలం 28 మంది మాత్రమే వెళ్లారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు వంశీరెడ్డి, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఐదో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంకతోపాటు బెహరా భాస్కరరావు కుటుంబసభ్యులు ఇద్దరు క్యాంపునకు వెళ్లకుండా నగరంలోనే ఉండిపోయారు. వ్యక్తిగత కారణాలతో సతీష్, రోహిణి రాలేదని చెబుతున్న వైసీపీ నేతలు...మిగిలిన ముగ్గురు గురించి మాత్రం మాట్లాడడం లేదు. ఇదిలావుంటే వైసీపీలో ఉన్న కొందరు తమకు అనుకూలంగా ఓటువేస్తారని కూటమి నేతలు చెబుతుంటే...కూటమి వైపు ఉన్న కార్పొరేటర్లలో కొందరు కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరవడం ద్వారా పరోక్షంగా తమకు సహకరిస్తారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. కూటమి కార్పొరేటర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసు ఆధారంగా మేయర్ బల నిరూపణకు ఏప్రిల్ 19న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. మంగళవారం దీనిపై అధికారికంగా ప్రకటన చేసి సభ్యులతోపాటు ఎక్స్‌అఫిషియో సభ్యులకు నోటీసులు అందజేయనున్నారు.

గ్రేటర్ రికార్డు

... 5వ పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పన్ను బకాయిలు వసూలయ్యేందుకు దోహదపడింది. వీటన్నింటి కారణంగా ఈ ఏడాది రూ.510 కోట్లకుపైగా పన్ను వసూలైంది. రికార్డు స్థాయిలో పన్నులు వసూలుకావడం ఆనందంగా ఉందని, దీనికి జిల్లా కలెక్టర్, డీసీఆర్, జోనల్ కమిషనర్లతోపాటు రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది కృషి కారణమని అదనపు కమిషనర్ సోమన్నారాయణ ఆనందం వ్యక్తంచేశారు.

నేటి నుంచి కేజీహెచ్‌లో ప్రతి రోజూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

... 5వ పేజీ తరువాయి

అందిస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అన్ని పని దినాల్లో ఈ సేవలు అందించనున్నారు. అలాగే, కార్డియాలజీ, కార్డియో థొరాసిక్, ప్లాస్టిక్ సర్జరీ, మెడికల్ అంకాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ అంకాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అనంతరం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల ఓపీ సేవలు అందించనున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ఈ మార్పులు చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషాలిటీ వైద్యులను నిత్యం రోగులకు అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు.

ఆర్థిక శక్తిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. విశాఖపట్నానికి మౌలిక వసతులు కల్పించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని, పర్యాటక అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడుతో పాటు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. పర్యాటకం, ఇన్నోవేషన్ హబ్‌గా నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ ప్రజలు ఎప్పుడూ తెలుగుదేశం వెంట అండగా ఉన్నారని, పార్టీకి ఈ జిల్లా కంచుకోట అని చెప్పారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతా ఎదురు గాలి వీచినా విశాఖ ప్రజలు మాత్రం టీడీపీకే పట్టం కట్టారని గుర్తు చేసుకున్నారు.

పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్

... 5వ పేజీ తరువాయి

చదువుకున్న సౌజన్య అనే యువతి మంత్రి లోకేశ్‌ను కలిసి తనకు ఉద్యోగం కల్పించాలని కోరింది. కాగా సోమవారం ఉదయం లోకేశ్‌ను ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణ బాబు, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

బ్రేకుల్లేని భారీ వాహనాలు!

... 5వ పేజీ తరువాయి

కొన్ని ఆంక్షలు విధించారు. అయితే భారీ వాహనాల నిర్వాహకులు, కొంతమంది వ్యాపారులు తమ స్వలాభం కోసం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. కొన్నాళ్ల కిందట కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఒక ద్విచక్ర వాహనాన్ని భారీ లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల వెంకోజీపాలెం జంక్షన్ వద్ద భారీ లారీ ఒకటి రద్దీగా ఉన్న సమయంలో ముందు వెళుతున్న కారును ఢీకొంది. దీంతో కారు రోడ్డుపైనే బోల్తాపడింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాసరే పోలీసులు, రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంకోజీపాలెం జంక్షన్ వద్ద కారును ఢీకొట్టిన లారీని పోలీసులు ఎంవీపీ స్టేషన్‌కు తీసుకువెళ్లి రెండు రోజులు ఉంచారు. తర్వాత రవాణా శాఖ అధికారుల సర్టిఫికెట్‌తో స్టేషన్ నుంచి లారీని నిర్వాహకుడు విడిపించుకుని తీసుకువెళ్లిపోయారు. అయితే లారీని నిర్వహిస్తున్న నగరానికి చెందిన ఒక పెట్రోల్ బంకు నిర్వాహకుడు 'ఏదో ప్రమాదం జరిగితే పోలీసులు, రవాణా శాఖ అధికారులకు డబ్బులు ఇచ్చి వాహనం తీసుకువెళ్లిపోతాం. కాకపోతే ఇప్పుడు లారీల ప్రవేశంపై ఆంక్షల పేరుతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు రెట్టింపు మొత్తాన్ని తీసుకున్నారు' అని చెబుతున్నారు. ఇప్పటికైనా రవాణా, పోలీసు అధికారులు నగరంలో రోడ్డు ప్రమాదాలకు కారణంగా మారుతున్న భారీ లారీల ప్రవేశంపై నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంది.

పూర్తి జీతాలు అప్పుడే...

... 5వ పేజీ తరువాయి

అవకాశం ఉందని, అందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

యూనియన్ నాయకులను దూరం పెట్టి

సాధారణంగా స్టీల్ ప్లాంటుకు ఢిల్లీ నుంచి ఎవరైనా పెద్దలు వచ్చి పరిపాలన, ఉత్పత్తి పరమైన అంశాలు చెప్పాలనుకున్నప్పుడు ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. కానీ స్టీల్ సెక్రటరీ వారితో కాకుండా కేవలం జూనియర్, యువ ఉద్యోగులతో సమావేశమయ్యారు. దీనిని యూనియన్లు తప్పుబడుతున్నాయి. సమస్యలు చెబుతామని, వాస్తవ పరిస్థితి వివరించి, ఎదురు ప్రశ్నిస్తామనే ఉద్దేశంతో తమను పిలవలేదని ఆరోపిస్తున్నారు. యువ ఉద్యోగులైతే ఎదురు ప్రశ్నించరని, ఎవరైనా మాట్లాడితే వారిని వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని, ఆ కారణంతో వారితోనే సమావేశం నిర్వహించారని విమర్శిస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ సెకండియర్ తరగతులు

... 5వ పేజీ తరువాయి

పేరిట ప్రభుత్వం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయనుంది. ఇప్పటికే ఆర్ఐవో కార్యాలయానికి 83,220 నోటు పుస్తకాలు చేరుకున్నాయి. వీటిని జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 3 కేజీబీవీ కళాశాలలు, 9 జడ్పీ మోడల్ హైస్కూళ్లకు పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది నుంచి పాఠ్య పుస్తకాలు కూడా మారుతున్నందున త్వరలో అవి కూడా వస్తాయని అధికారులు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కనీసం పాఠ్య పుస్తకాలు కూడా పంపిణీ చేయలేదు. గత ఏడాది కొత్త ప్రభుత్వం ఏర్పడడంతోనే ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది తరగతుల ప్రారంభానికి ముందే పుస్తకాలు పంపిణీకి సిద్ధం చేశారు.

'వీసీ అందరికీ న్యాయం చేయాలి'

వెంకోజీపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఏయూ సీపీఎస్‌లో జరిగిన ప్రమోషన్లలో అందరికీ న్యాయం చేయాలని, అర్హత ఉండి మిగిలిన వారికి తక్షణమే మరో నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏయూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు సురేష్ మీనన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏయూలో టైం అయినా కొనసాగుతున్న ఎడిటెడ్ ఫ్యాకల్టీని పంపించే విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై మౌనంగా ఉండటం ఎడిటెడ్ ఫ్యాకల్టీని కొనసాగించటానికి ఒక కారణమని తెలుస్తుందని, ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ పదవిని ప్రొఫెసర్ ప్రసన్నశ్రీకి రావలసి ఉన్నా ప్రొఫెసర్ కర్మాకర్‌ను నియమించినా మౌనంగా ఉండటం తెలిసిన విషయమేనన్నారు. ఖరగ్‌పూర్ ఐఐటీ నుంచి ఏయూకి వీసీగా వచ్చిన ప్రొఫెసర్ రాజశేఖర్ అందరికీ న్యాయం చేయాలని కోరారు.

అలరించిన రామ భజన

వెంకోజీపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాత వెంకోజీపాలెం సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రామ భజన ఆకట్టుకుంది. మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు,సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు కర్రి వెంకట సూర్య అప్పారావు,ప్రధాన కార్యదర్శి బొడ్డేటి రామకృష్ణ, కార్యదర్శి కర్రి రవి, కోశాధికారి యల్లపు శ్రీన, ఇతర కార్యవర్గ సభ్యులు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ రవికుమార్, జనసేన నాయకులు వీంకట పరదేశి నాయుడు, పాల్గొన్నారు.

ఘనంగా పందిరి రాట

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెద గదిలి కొండవాలు ప్రాంతంలోని ఈశ్వర దేవి నగర్‌లో సీతారామ కల్యాణ ఉత్సవం సందర్భంగా సోమవారం పందిరి రాట వేశారు. పండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది.

మూలపాలెంలో...

ఎంవీపీ కాలనీ : మూలపాలెం గ్రామ పరిధిలోని సాగరతీరంలో ఉన్న సీతారామ సాగర లింగేశ్వర ఆలయం వద్ద సోమవారం శ్రీరామనవమి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా ఉత్సవ మూర్తులను తిరువూరులో ఊరేగింపు, 6న వంద మంది దంపతులతో సీతారామ కల్యాణం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు అధ్యక్షుడు పరదేశి తెలిపారు.

రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1.31 కోట్ల ఆదాయం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం సెలవైనప్పటికీ ప్రభుత్వం ఆదేశం మేరకు ఆర్థిక సంవత్సరం చివరిరోజు కావడంతో పనిచేసింది. జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 99 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా రూ.1.31 కోట్ల ఆదాయం వచ్చింది. ఒక్క మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారానే రూ.33 లక్షలు వచ్చినట్టు జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు తెలిపారు. ఉగాది రోజున అంటే ఆదివారం రూ.82 లక్షల ఆదాయం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు రోజులు పనిచేయడం వల్ల 146 రిజిస్ట్రేషన్లతో రూ.2.13 కోట్ల ఆదాయం సమకూరింది.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్లికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 22, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది)50, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలీ 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాల కూర 3, తోట కూర 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

తీరంలో బీచ్‌ల పునరుద్ధరణ

పోర్టు సహకారంతో డీసీఐ ద్వారా పనులు

బీచ్ రోడ్డు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తీరంలో బీచ్‌ల పునరుద్ధరణ పనులకు తవ్వకాల సంస్థ (డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) చర్యలు తీసుకోనుంది. విశాఖ పోర్టు ట్రస్ట్ (వీపీటీ) సహకారంతో ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో డీసీఐ ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ పనులను పోర్టు ట్రస్ట్ చైర్మన్ ప్రారంభించనున్నారు. బీచ్ రోడ్డులోని వైఎంసీఏ కూడలి సమీపంలో ఈ కార్యక్రమం జరగనుంది. బీచ్ పునరుద్ధరణ ప్రాజెక్టును 30 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళిక చేశారు.

బీచ్‌ల ఏర్పాటుకు అవకాశం

సాధారణంగా తీరంలోని బీచ్‌ల వద్ద ఉన్న ఇసుక పలు కారణాలతో సముద్రంలోకి జారిపోతుంది. దీంతో తీరం కోతకు గురవుతుంది. సముద్రంలో అక్కడక్కడ ఇసుక మేటలు వేస్తుంది. తవ్వకాల ద్వారా బీచ్‌ను మళ్లీ పునరుద్ధరించనున్నారు. ప్రస్తుతం ఉన్న బీచ్‌లపై మరో పొరలా ఇసుకను నింపడం, కొత్త ప్రాంతాల్లో బీచ్‌ను ఏర్పాటు చేయడం వంటివి చేస్తారు. కోతకు గురైన చోట అధిక మొత్తంలో ఇసుక వేసి విశాలంగా ఏర్పాటు చేసేందుకు అవకాశముంది.


తీరంలో జరుగుతున్న డ్రెడ్జింగ్ పనులు

ఇలా చేయడం వలన బీచ్‌ల పునరుద్ధరణ చేయడంతో పాటు సముద్రం లోపల భారీ నౌకల రాకపోకలకు అవకాశం పెరగనుంది. త్వరలో విశాఖ నగర పరిధిలోని బీచ్‌లను ఇసుక మేటలతో మరింత సుందరంగా తయారు చేసేందుకు అవకాశం కల్పిస్తుంది. జిల్లా యంత్రాంగం ప్రస్తుతం ఉన్న బీచ్‌లతోపాటు అదనంగా మరికొన్ని బీచ్‌లను ఏర్పాటు చేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో తీర ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇలా చేయడం వలన తీరం కోతకు గురవ్వకుండా రక్షించుకోవచ్చు.

ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం : సీపీఎం

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉధృత పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్కె. ఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 2 నుంచి 6 వరకు తమిళనాడులోని మధురై పట్టణంలో జరుగుతున్న సీపీఎం అఖిల భారత 24వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ అన్ని శాఖలకు పార్టీ పిలుపునిచ్చిందన్నారు. ఇందులో భాగంగా సోమవారం 10వ వార్డు బీఎన్నార్‌నగర్ కాలనీలో పార్టీ పతాకావిష్కరణ చేశామన్నారు. విద్యుత్ సంస్కరణల పేరిట స్మార్ట్ మీటర్లు పెట్టడం, ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు అంటూ విని యోగదారులపై అధిక భారం మోపడం ఆపాలని ఈ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి. వెంకటరావు, డి.నాగరాజు, స్థానిక సంఘ నాయకులు ఎ.రమణ, జి. నాగరాజు, పి.మణి, కృష్ణవేణి, అన్నపూర్ణ, సీతాలక్ష్మి, చంద్రమౌళి, సూరిబాబు, సంగీతరాణి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భద్రావతి పూజా మహోత్సవం

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోని 11వ వార్డు ఆరిలోవ 1వ సెక్టారు గాంధీనగర్‌లోని భక్త మార్కండేయ పద్మశాలి యువజన సేవా సంఘం ప్రతినిధి కాకి గంగరాజు ఆధ్వర్యంలో సోమవారం భావనారుషి, భద్రావతి పూజ ఘనంగా జరిగింది. ఆరిలోవ పరిసర ప్రాంతాల్లోని సుమారు వెయ్యిమంది పద్మశాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రావతి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కేటరింగ్ రాజు, పప్పు రాజారావు, కరణం వెంకటేశ్వరరావు, వానపల్లి ఈశ్వరరావు, తెడ్లపు వెంకటేశ్వరరావు, కొప్పల రమేష్, వానపల్లి గాయిత్రి, అయ్యంకల శ్రీనివాసరావు, కొప్పల రాంకుమార్ తదితరలు పాల్గొన్నారు. అందరికీ అన్న ప్రసాదాలు వితరణ చేశారు.

పేద విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

వెంకోజీపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు వినాయకుడి గుడి వద్ద పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిలు, ఎరేజర్లు వంటి విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. దుర్గాసాయి శ్యాము నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పాల్గొన్నారు. వంద మంది విద్యార్థులు వీటిని పొందారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పేరిట విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.15 వేలు చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చి 9 నెలలు గడిచినా ఒక్కటీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే తల్లికి వందనం నిధులు విడుదల చేసి విద్యార్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాతలు కోట్ల శ్రీనివాసరావు, ఎస్.దుర్గాప్రసాద్, ఆర్.సాయి, వి. వికాస్‌శ్యాము తదితరులు పాల్గొన్నారు.

కేటుగాడు

- అశ్లీల వీడియోలతో మహిళకు బ్లాక్ మెయిల్
- రూ. 4 కోట్లు నగదు, 800 గ్రాముల బంగారం కాజేసిన మోసగాడు
- సీపీని ఆశ్రయించిన బాధితురాలు
- త్రీటౌన్ పోలీసుల అదుపులో నిందితుడు


అక్షయ్‌కుమార్

మద్దిలపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) :ఒక వ్యక్తి నుంచి వచ్చిన రాంగ్ ఫోన్ కాల్ మాట్లాడినందుకు ఓ మహిళ ఏకంగా రూ.4 కోట్లు నగదు, 800 గ్రాముల బంగారం పోగొట్టుకోవడమే కాకుండా పదేళ్లు అతనితో మానసిక నరకం అనుభవించింది. అయినా అతని వేధింపులు ఆగకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భార్యను కాపాడి విషయం తెలుసుకున్న భర్త గత నెల 23న నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో రెవెన్యూ కాలనీకి చెందిన బుర్లసంపర్తిపూరి అక్షయ్‌కుమార్ (39) రియల్ ఎస్టేట్ వ్యాపారి. అతను ఓ దంత వైద్యురాలిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.వారికి ఇద్దరు కుమార్తెలు. భర్త జులయిగా తిరగడంతో భార్య విడాకులు తీసుకుంది. ఒక కుమార్తె అక్షయ్‌కుమార్ వద్ద, మరో కుమార్తె అతని భార్య వద్ద ఉంటున్నారు. 2014లో అతను ఆకతాయిగా ఓ ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. అది భీమవరంలో బంగారు ఆభరణల షోరూమ్ భార్యకు వెళ్లింది. ఫోన్ కాల్‌ను ఆమె మాట్లాడి రాంగ్ నంబర్ అని కట్ చేసినా.. మహిళ వాయిస్ విన్న అక్షయ్ పదే పదే ఫోన్ చేసి ఆమెకు మాయ మాటలు చెప్పి పరిచయం పెంచుకున్నాడు. అది కాస్తా స్నేహంగా మారడంతో వ్యక్తిగత విషయాలు కూడా మహిళ ఫోన్‌లో చెప్పడం, వాటిని రికార్డ్ చేసి బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. శారీరకంగా కలవడానికి ఒప్పుకోవాలని లేదంటే కాల్ రికార్డ్స్ భర్తకు పంపిస్తానని బెదిరించాడు. భర్తకు తెలిస్తే ఏమవుతుందన్న భయంతో అక్షయ్‌తో ఆమె శారీరకంగా కలవడానికి అంగీకరించింది. ఈమేరకు అక్షయ్ ఆమెతో శారీరకంగా కలిసి ఆమెకు తెలియకుండా అశ్లీల వీడియోను ఫోన్‌లో రికార్డ్ చేశాడు. ఆ వీడియోలతో నగదు కావాలని బ్లాక్ మెయిల్ చేశాడు. అక్షయ్ బ్లాక్ మెయిల్ చేసినప్పుడల్లా అతని యూనియన్ బ్యాంక్, కరూర్ వైశ్యబ్యాంక్ ఖాతాలకు రూ. 3 కోట్లకు పైగా నగదు బదిలీ చేసింది. అంతేకాకుండా 800 గ్రాముల బంగారం కూడా కాజేశాడు. భీమవరంలో ఆమె భర్తకు తెలిసిపోతుందని రెండుసార్లు విశాఖకు పిలిచి సీఎంఆర్ సెంట్రల్ ఎదురుగా ఒకసారి రూ.10 లక్షలు, మరోసారి రూ. 5 లక్షలు తీసుకున్నాడు. అంతటితో ఆపకుండా మళ్లీ మళ్లీ నగదు కావాలని బ్లాక్‌మెయిల్ చేశాడు. ఇక ఇవ్వడానికి ఆమె వద్ద నగదు లేకపోవడంతో భీమవరంలో ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. దీంతో అసలు విషయం తెలుసుకున్న ఆమె భర్త సీపీకి ఫిర్యాదు చేశాడు. త్రీ టౌన్ పోలీసులు అక్షయ్‌ను తిరుపతిలో అరెస్ట్ రిమాండ్‌కు పంపించారు. అతని వద్ద 75 గ్రాముల బంగారం, ఎస్ క్రాస్ కారును స్వాధీనం చేసుకున్నారు. అతని బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారు.

జనసేన సంస్థాగత నిర్మాణమే ప్రస్తుత లక్ష్యం

పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని పూర్తి సంస్థాగతంగా నిర్మించడమే ప్రస్తుత లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ పార్టీ నాయకులు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీతంపేటలోని జనసేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదకొండు ఏళ్లుగా ప్రజా సంక్షేమం,పేదరిక నిర్మూలన, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం, నవ సమాజ నిర్మాణమే ప్రధాన అంశాలుగా అధినేత పవన్ కల్యాణ్ నేతృత్వంలో పనిచేస్తున్నామన్నారు. పార్టీ అంచెలంచెలుగా ఎదిగి ఇప్పుడు 11.81 లక్షల మంది సభ్యులతో కళకళలాడుతోందన్నారు. పార్టీ జెండా మోసే కార్యకర్త కుటుంబానికి బీమా ద్వారా భరోసా కల్పించిన ఏకైక పార్టీగా జనసేన నిలిచిందన్నారు. ఏ అధికారం లేకుండా ఒక్క ఎమ్మెల్యే/ఎంపీ లేకుండా పార్టీని పదకొండేళ్లు నడపడం ఆషామాషీ కాదన్నారు. ఇప్పుడు బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణం జరుగుతోందన్నారు. విశాఖలో గత వైసీపీ పెద్దలు ప్రభుత్వ భూములు, పర్యాటక ఆస్తులను ఆక్రమించుకున్నారని, ఇలాంటి ఇబ్బందులను అధిగమించి, నగరాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం గట్టిగా పని చేస్తోందన్నారు. త్వరలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ టి. శివశంకరరావు, పార్టీ నాయకులు కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల. పక్కన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్


శంకుస్థాపనలో పాల్గొన్న నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీభరత్, వరుణ్ గ్రూపు చైర్మన్ ప్రభు కిశోర్

దేశంలో ఐదో ఆర్థిక నగరంగా విశాఖ

ఐటీ మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖను దేశంలో ఐదవ ఆర్థిక నగరంగా అభివృద్ధి చేస్తామని ఐటీ శాఖా మంత్రి లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలో 'తాజ్-వరుణ్' గ్రూపు ఆధ్వర్యంలో 'వరుణ్ బే శాండ్స్' పేరుతో నిర్మించనున్న స్టార్ హోటల్, ఆఫీస్ టవర్లకు తల్లి భువనేశ్వరితో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని, ఇప్పుడు చంద్రబాబు 'బ్రాండ్' స్పష్టంగా కనిపించేలా పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రాజెక్టు ద్వారా రూ.500 కోట్ల సంయుక్త పెట్టుబడి రాష్ట్రానికి వస్తోందన్నారు. విశాఖలో ఐటీ ద్వారా ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, హోం మంత్రి అనిత, పౌర సరఫరాల శాఖా మంత్రి మనోహర్, కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు ఎం. శ్రీభరత్, సీఎం రమేశ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు,వరుణ్ గ్రూపు చైర్మన్ ప్రభు కిశోర్, ఎండీ వరుణ్‌దేవ్, జేఎండీ వర్ష పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్



ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డు పరిధిలోని తోటగరువు సమీపంలో ఉన్న డెయిరీ ఫారం ఖాళీ స్థలంలో ముస్లింలు సోమవారం రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 వరకు ప్రార్థనలు చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

అలరించిన సంగీత కచేరీ

ఎంవీపీ కాలనీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. లలిత సప్తస్వరాల బృందం ఆధ్వర్యంలో శ్రీరామదాసు కీర్తనలు, జయదేవుని అష్టపదులు, త్యాగరాజు కీర్తనలు ఆలపించారు. వీనుల విందుగా సాగిన కచేరీని భక్తులు ఆస్వాదించారు.

జెర్రిపోతులపాలెంలో పెద్దలకు ఇళ్లపై ఆరా

అక్రమార్కులపై చర్యలకు అధికారుల యోచన

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు ఇళ్ల మంజూరు వ్యవహారాన్ని హౌసింగ్ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీనికి సంబంధించి 'పేదల కాలనీలో పెద్దలకు ఇళ్లు' శీర్షికన మార్చి 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి హౌసింగ్ అధికారులు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మంజూరుకు సంబంధించి వివరాల కోసం పెందుర్తి తహసీల్దారు కార్యాలయం నుంచి సమాచారం తీసుకోవాలని యోచిస్తున్నారు. గ్రామంలో మొత్తం 134 మందికి వైసీపీ హయాంలో 1.5 సెంట్లు విస్తీర్ణంలో ప్లాట్లు వేసి, ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు మంజూరుచేశారు. సగానికిపైగా అనర్హులుండడంపై గత ఏడాది చివర్లో విచారణ చేపట్టారు. సుమారు 60 మంది అనర్హులున్నారని వీఆర్వో విచారణలో తేలగా ఈ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవడానికి రెవెన్యూ అధికారులు ముందుకురాలేదు. అయితే 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అనర్హులపై చర్యల కోసం కలెక్టర్ అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు.


కేంద్రకారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

సెంట్రల్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి

ఆరిలోవ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో ఖైదీలందరికీ ఉచిత న్యాయ సహాయం అందుతుందా? లేదా? అని జిల్లా ప్రధాన న్యామూర్తి ఆలపాటి గిరిధర్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఆయన సోమవారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంలో భాగంగా ఆయన ఖైదీలతో మాట్లాడారు. జైలులోని న్యాయ సహాయ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయం పై సమీక్షించారు. అనంతరం ఆయన ఖైదీలతో మాట్లాడుతూ వారి కేసుల వివరాలపై ఆరా తీశారు. జైలులో వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జైలులోని వివిధ బ్లాకులను ఆయన సందర్శించారు. అక్కడ పరిశుభ్రత పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు, ఉప పర్యవేక్షణాధికారులు జవహర్ బాబు, సాయి ప్రవీణ్, జైలర్లు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చందనోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఉత్సవ ముఖ్యఅధికారి భ్రమరాంబ

సింహాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవానికి సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని చందనోత్సవ ముఖ్య అధికారి (ఆర్‌జేసీ) ధర్మముళ్ల భ్రమరాంబ కోరారు. ఈనెల 30న జరునున్న చందనోత్సవంపై ఈవో కె. సుబ్బారావుతో కలిసి సోమవారం సింహగిరిపై దేవస్థానం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామాన్య భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికలతో కృషి చేయాలన్నారు. క్యూలు, పార్కింగ్ స్థలాల ఏర్పాటుపై కార్యనిర్వాహక ఇంజనీర్లు దండు గణపతి శ్రీనివాసరాజు, బండారు రాంబాబు వివరించారు. లక్షన్నరకు పైగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లకు పూర్తిస్థాయిలో నీడ కల్పించాలని, భక్తులందరికీ తాగునీరు, మజ్జిగ అందేలా చూడాలన్నారు. భక్తుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, తాత్కాలిక మరుగుదొడ్లను సిద్ధం చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. ఉత్సవంలో స్వచ్ఛంద సంస్థల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఓ ఆనందకుమార్, పిల్లా శ్రీనివాస్, డీఈఈ రామరాజు, పర్యవేక్షణాధికారులు రాజ్యలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, సత్యవాణి, గాయత్రి, శ్రీనివాస్, నరసింగరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఎఫ్‌వో భ్రమరాంబ

భీమిలి బీచ్‌లో గుండెపోటుతో యువకుడి మృతి

భీమునిపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల తన కుమారుడ్ని పట్టుకుని సరదాగా స్నేహితులతో కలిసి సముద్రంలో స్నానానికి దిగిన వ్యక్తి గుండె నొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషాద సంఘటన భీమిలి బీచ్‌లో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాలు ప్రకారం.. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన గెద్ద పరదేశి (37), అతని కుమారుడు శ్రీనివాస్ (5), స్నేహితులు బొల్లా సత్యనారాయణ (30), బొల్లా శంకర్ (29), వెంపల మణికంఠ (19)తో కలిసి రెండు బైకులతో సాయంత్రం 4 గంటలకు బీచ్‌కు వచ్చారు. మణికంఠ ఒడ్డున వుండగా, పరదేశి తన కుమారుడ్ని పట్టుకుని సముద్రంలో ఈతకు దిగాడు. ఆయనతో పాటు సత్యనారాయణ, శంకర్ కూడా దిగి ఈత కొడుతుండగా పరదేశికి ఆకస్మాత్తుగా గుండెలో తీవ్ర నొప్పి రావడంతో ఒడ్డుకు వచ్చేశాడు. శ్రీనును మణికంఠకు అప్పజెప్పి తనకు గుండెలో నొప్పి వస్తుందని, నీరసంగా వుందని చెబుతూ పక్కకు వాలిపోయాడు. వెంటనే స్నేహితులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా పరదేశి మరుపల్లిలో పాల కేంద్రాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు. అతనికి భార్య నిర్మల, కుమార్తె రిషిత, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


పరదేశి (ఫైల్)

రైలు నుంచి జారిపడి విశాఖవాసి మృతి

గొల్లప్రోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కూతురుకి పుట్టి వెంట్రుకలు తీయించేందుకు విజయవాడ కనక దుర్గమ్మ గుడికి వెళ్తూ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మరణించాడు. ఈ సంఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. విశాఖ నగరంలోని మర్రిపాలెం ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ (34) కూతురికి పుట్టి వెంట్రుకలు తీయించేందుకు విజయవాడ వెళ్లడానికి విశాఖ నుంచి హైదరాబాదు వెళ్లే వీక్లి సూపర్‌ఫాస్ట్ రైలులో కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం బయలుదేరారు. మధ్యాహ్నం భోజనం చేసి చేయి కడుక్కునేందుకు వాష్ బేసిన్ వద్దకు వెళ్లగా రైలు కుదుపులకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు రైల్వేస్టేషన్ వద్దకు వచ్చేసరికి కిందకు జారిపడి మరణించాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. అనిల్‌కుమార్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తుని రైల్వే ఎస్ఐ జి. శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు భారీగా దరఖాస్తులు

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచితంగా ప్రాథమిక కుట్టు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా బీసీ సంక్షేమ శాఖ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించగా భారీ స్పందన వచ్చింది. బీసీ సంక్షేమశాఖ పరిధిలోని బీసీ, కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా ఆయా కులాల మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందించనున్నారు. ఇందుకోసం జిల్లాకు 3,596 యూనిట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. కాగా జిల్లా వ్యాప్తంగా 18,300కు పైగా దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. వడపోత ప్రక్రియను రెండు రోజుల్లో చేపట్టనున్నారు. అర్హుల ఎంపికకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన తరువాత, ఎంపికైన వారికి 45 నుంచి 90 రోజుల పాటు శిక్షణ ఉంటుంది.

స్త్రీల రామాయణ పాటలు ఆసక్తికరం: మలయవాసిని


ప్రవచనమిస్తున్న మలయవాసిని

అక్కయ్యపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్రుల సందర్భంగా లలితానగర్‌లోని లలితా పీఠంలో రామాయణ ప్రవచనాలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. స్త్రీల రామాయణపు పాటల వైశిష్ట్యాన్ని, జానపద రామాయణాల విశేషాలను ఆచార్య కోలవెన్ను మలయవాసిని వివరించారు. రామాయణ గ్రంథాలలో లేని అనేక విషయాలు జానపద స్త్రీలు తమ ఆలోచనలు, నమ్మకాలకు అనుగుణంగా భావించి పాడుకుంటారని, ఈ కథలు చాలా ఆసక్తికరమేకాక పాడుకోవడానికి వీలుగా ఉంటాయని చెప్పారు. రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు వంటి పాత్రలను తమ కుటుంబ సభ్యులుగా భావించి ఆత్మీయంగా పాడుకుంటారని ఆమె వివరించారు. ప్రవచన కర్తను పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణసేన్ సత్కరించారు. ప్రవచనాలు నాలుగు రోజులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఇద్దరి ఉసురు తీసిన మద్యం

మహారాణిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మద్యం కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వన్‌టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు. చిలకపేటకు చెందిన కనకమహాలక్ష్మి (20) తన భర్తతో నివాసం ఉంటోంది. భర్త నిత్యం మద్యం తాగి గొడవలు పడుతూ ఉన్నాడు. మద్యం మానేస్తానని చెప్పి కొన్నాళ్ల తరువాత తిరిగి తాగుతూ వేధించేవాడు. దీనితో మనస్తాపం చెందిన కనకమహాలక్ష్మి ఇంటిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మరో ఘటనలో కొత్త జాలారి పేటకు చెందిన బూతి వీరేంద్ర (32) నిత్యం మద్యం తాగుతూ సెల్‌ఫోన్ గేమ్స్ ఆడేవాడు. అతని కుటుంబ సభ్యులు మందలించడంతో మద్యం మత్తులో ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

శారదా నదిలో మునిగి యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న శారదా నదిలో ఓ యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందిన సంఘటనపై ఫిర్యాదు అందినట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి.. విశాఖపట్నం తాటిచెట్లపాలేనికి చెందిన షేక్ అబ్దుల్ (32) పెయింటింగ్ పనులు చేస్తుండేవాడు. ఏడాది క్రితం అనకాపల్లి వచ్చి పనులు చేసుకునేవాడు. ఆదివారం మధ్యాహ్నం నదిలోకి దిగిన ఆ యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందినట్టు చెప్పారు. దీనిపై అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి విచారణ జరపగా, నది ఒడ్డున లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా అతడి వివరాలు గుర్తించామన్నారు. మృతుడి సోదరి షేక్ జినిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

యువత ఉపాధి కల్పనకు పవన్ తపన: మంత్రి నాదెండ్ల


మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

సీతంపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి కల్పించాలనే తపనతో ఉన్నారని త్వరలోనే భారీ పెట్టుబడులు వస్తాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. అభివృద్ధికి దూరంగా ఉన్న గిరిజన గ్రామాల్లో పర్యటించి రహదారులు వేయడం ద్వారా మార్పు తీసుకొచ్చారని అన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లోని నగర జనసేన కార్యాలయంలో సోమవారం జీవీఎంసీ కార్పొరేటర్లతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ దీపం పథకం ద్వారా ఇప్పటి వరకు 99 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించామన్నారు. అధినేత పవన్ కల్యాణ్ అడుగు జాడలలో నడుస్తూ జనసేన గెలిచిన 21 నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందించడం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఆవిర్భావ సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు తమ నాయకుని తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంకితభావంతో పని చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్లు, రిజనల్ కో-ఆర్డినేటర్లు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖలో మార్పులు ప్రజలకు మేలు: కోసూరి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన నూతన మార్పుల కారణంగా ప్రజలకు మేలు చేకూరుతుందని బీసీ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోసూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నగరానికి వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. మంత్రి మనోహర్ స్పందిస్తూ జనసేన పార్టీ పటిష్టానికి ప్రతీ ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

స్పోర్ట్స్ లైబ్రరీ ప్రారంభం


బ్యాడ్మింటన్ అకాడమీలో సరదాగా ఆడుతున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో మెలకువలు, నైపుణ్యం, సాధన, నిబంధనలు, క్రమశిక్షణ వంటి అంశాలపై వర్ధమాన క్రీడాకారులలో అవగాహన కల్పించేందుకు లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీలో స్పోర్ట్స్ లైబ్రరీని ఏర్పాటు చేశారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు, ఐటీ కమిషనర్ పద్మనాభన్ ముఖ్య అతిథులుగా హాజరై స్పోర్ట్స్ లైబ్రరీని, కొత్తగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. శిక్షణకు పిల్లలను తీసుకువచ్చే తల్లిదండ్రుల నిరీక్షణ విభాగాన్ని అతిథులు ప్రారంభించి, అకాడమీ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ ఆలోచనను అభినందించారు. మాజీ ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు, కార్పొరేటర్ పి.ఉషశ్రీ, వైజాగ్ ప్రొఫైల్స్ సీఎండీ బండి సురేష్, వీపీఎల్ డైరక్టర్ కృష్ణారావు, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం


భద్రావతి దేవి, భవనా రుషి కల్యాణం జరిపిస్తున్న అంజనేయ గురుస్వామి

సీతంపేట, మార్చి 31, (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లో భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భద్రావతి దేవి బావనా రుషి స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అఖిల భారత పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం గౌరవ అధ్యక్షుడు ఆమంచి అంజనేయ గురుస్వామి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను సీతంపేట పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుదే రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుదే త్రినాథ్, గౌరవ అధ్యక్షుడు గుదే వేణు, సంఘం ప్రతినిధులు వాసపల్లి గంగరాజు, పప్పు ప్రసాద్, ఈశ్వర్, ఆకుల శ్రీనివాస్‌రావు, బేత అప్పారావు, ఇమంది వీర్రాజు, లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

ప్రియుడిపై కోపంతో వాహనాలకు నిప్పు

నిందితురాలి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి

మహారాణిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశ్వనాథం రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మార్చి 29న 13 వాహనాలు దగ్ధం కావడానికి కారకురాలిగా భావిస్తున్న కలిగొట్ల కరుణ (27) అనే మహిళను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. ప్రియుడు తనను నిర్లక్ష్యం చేస్తున్నాడన్న కోపంతో అతడు కొత్తగా కొనుగోలు చేసి పార్కింగ్‌లో పెట్టిన వాహనానికి ఆమె నిప్పు పెట్టడంతో చుట్టూ ఉన్న మరో 12 ద్విచక్రవాహనాలకు సైతం మంటలు అంటుకుని కాలి బూడిదయ్యాయని చెప్పారు. టూటౌన్ పోలీసు స్టేషన్లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిస్తూ ఈ ఘటనలో నిందితురాలిది బర్మా క్యాంప్ అని తెలిపారు. విశ్వనాథం రోడ్డులో ఇటీవల నిర్మించిన అపార్టుమెంట్‌లో గువ్వల భరత్ కుమార్ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. కలిగొట్ల కరుణను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెతో సంబంధం కొనసాగించాడు. కొంతకాలంగా భరత్ ఆమెను అలక్ష్యం చేస్తూ దూరమయ్యాడు. తనను మోసగించడంతో భరత్‌పై ఆమె కక్ష పెంచుకుంది. అతడి వాహనంపై తాను తిరగవలసి ఉండగా, అతని భార్య వెళ్తోందని ఉక్రోషం పట్టలేక మార్చి 29 తెల్లవారుజామున భరత్ ఉంటున్న అపార్టుమెంట్ వద్దకు కరుణ వెళ్లింది. ఉగాది రోజు ప్రారంభిద్దామని అనుకుని కొత్త వాహనంపై కవర్ వేసి పెట్టుకున్నాడు. కరుణ అగ్గిపుల్లతో ఆ కవర్‌కు నిప్పు అంటించడంతో క్షణాల్లో మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో అతని వాహనం సహా సెల్లార్ పార్కింగ్‌లో ఉన్న మొత్తం 13 వాహనాలు పూర్తిగా ఆహుతి కాగా, బయట ఉన్న మరో 5 వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కాలిపోయిన సొత్తు విలువ రూ.19 లక్షలుగా ఆయన పేర్కొన్నారు. టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు, ఎస్‌ఐ సతీష్‌లు సుమారు 12 గంటల వ్యవధిలో కేసు ఛేదించి నిందితురాలు కరుణను అరెస్టు చేశారని ఏసీపీ లక్ష్మణమూర్తి వివరించారు.

15 ఏళ్లుగా భర్త కనిపించడం లేదని మహిళ ఫిర్యాదు


సురేష్ (ఫైల్)

కంచరపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త తిరిగి వస్తాడని ఎదురుచూసి రాకపోవడంతో భార్య కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కంచరపాలెం దరి ఐటీఐ జంక్షన్ సిద్ధార్థనగర్‌కు చెందిన కోనేటి గంగాప్రియ (38) తల్లి వద్ద తన కుమారుడు, కుమార్తెతో నివాసం ఉంటోంది. సుమారు 15 ఏళ్ల క్రితం భర్త సురేష్, భార్య గంగాప్రియతో గొడవపడ్డాడు. ఆ సమయంలో సురేష్ అత్త కాలు విరిగిపోయింది. అప్పట్లో గంగాప్రియ పోలీసులకు ఫిర్యాదు చేస్తుందేమోనన్న భయంతో సురేష్ ఇంటికి చేరుకోలేదని గంగాప్రియ ఫిర్యాదులో పేర్కొంది. ఏ రోజైనా వస్తాడనే ఆశతో ఎదురుచూస్తున్న గంగాప్రియ ఇంతవరకు భర్త రాకపోవడంతో సోమవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదనపు ఎస్‌ఐ ఎం.రవిచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆర్థిక శక్తిగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. విశాఖపట్నానికి మౌలిక వసతులు కల్పించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని, పర్యాటక అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడుతో పాటు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. పర్యాటకం, ఇన్నోవేషన్ హబ్‌గా నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ ప్రజలు ఎప్పుడూ తెలుగుదేశం వెంట అండగా ఉన్నారని, పార్టీకి ఈ జిల్లా కంచుకోట అని చెప్పారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రమంతా ఎదురు గాలి వీచినా విశాఖ ప్రజలు మాత్రం టీడీపీకే పట్టం కట్టారని గుర్తు చేసుకున్నారు.

పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్

... 5వ పేజీ తరువాయి

చదువుకున్న సౌజన్య అనే యువతి మంత్రి లోకేశ్‌ను కలిసి తనకు ఉద్యోగం కల్పించాలని కోరింది. కాగా సోమవారం ఉదయం లోకేశ్‌ను ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

బ్రేకుల్లేని భారీ వాహనాలు!

... 5వ పేజీ తరువాయి

కొన్ని ఆంక్షలు విధించారు. అయితే భారీ వాహనాల నిర్వాహకులు, కొంతమంది వ్యాపారులు తమ స్వలాభం కోసం నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. కొన్నాళ్ల కిందట కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఒక ద్విచక్ర వాహనాన్ని భారీ లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇటీవల వెంకోజీపాలెం జంక్షన్ వద్ద భారీ లారీ ఒకటి రద్దీగా ఉన్న సమయంలో ముందు వెళుతున్న కారును ఢీకొంది. దీంతో కారు రోడ్డుపైనే బోల్తాపడింది. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాసరే పోలీసులు, రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంకోజీపాలెం జంక్షన్ వద్ద కారును ఢీకొట్టిన లారీని పోలీసులు ఎంవీపీ స్టేషన్‌కు తీసుకువెళ్లి రెండు రోజులు ఉంచారు. తర్వాత రవాణా శాఖ అధికారుల సర్టిఫికెట్‌తో స్టేషన్ నుంచి లారీని నిర్వాహకుడు విడిపించుకుని తీసుకువెళ్లిపోయారు. అయితే లారీని నిర్వహిస్తున్న నగరానికి చెందిన ఒక పెట్రోల్ బంకు నిర్వాహకుడు 'ఏదో ప్రమాదం జరిగితే పోలీసులు, రవాణా శాఖ అధికారులకు డబ్బులు ఇచ్చి వాహనం తీసుకువెళ్లిపోతాం. కాకపోతే ఇప్పుడు లారీల ప్రవేశంపై ఆంక్షల పేరుతో పోలీసులు, రవాణా శాఖ అధికారులు రెట్టింపు మొత్తాన్ని తీసుకున్నారు' అని చెబుతున్నారు. ఇప్పటికైనా రవాణా, పోలీసు అధికారులు నగరంలో రోడ్డు ప్రమాదాలకు కారణంగా మారుతున్న భారీ లారీల ప్రవేశంపై నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంది.

పూర్తి జీతాలు అప్పుడే...

... 5వ పేజీ తరువాయి

అవకాశం ఉందని, అందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

యూనియన్ నాయకులను దూరం పెట్టి

సాధారణంగా స్టీల్ ప్లాంటుకు ఢిల్లీ నుంచి ఎవరైనా పెద్దలు వచ్చి పరిపాలన, ఉత్పత్తి పరమైన అంశాలు చెప్పాలనుకున్నప్పుడు ఉద్యోగ, కార్మిక సంఘ నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. కానీ స్టీల్ సెక్రటరీ వారితో కాకుండా కేవలం జూనియర్, యువ ఉద్యోగులతో సమావేశమయ్యారు. దీనిని యూనియన్లు తప్పుబడుతున్నాయి. సమస్యలు చెబుతామని, వాస్తవ పరిస్థితి వివరించి, ఎదురు ప్రశ్నిస్తామనే ఉద్దేశంతో తమను పిలవలేదని ఆరోపిస్తున్నారు. యువ ఉద్యోగులైతే ఎదురు ప్రశ్నించరని, ఎవరైనా మాట్లాడితే వారిని వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉందని, ఆ కారణంతో వారితోనే సమావేశం నిర్వహించారని విమర్శిస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ సెకండియర్ తరగతులు

... 5వ పేజీ తరువాయి

పేరిట ప్రభుత్వం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయనుంది. ఇప్పటికే ఆర్‌ఐవో కార్యాలయానికి 83,220 నోటు పుస్తకాలు చేరుకున్నాయి. వీటిని జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 3 కేజీబీవీ కళాశాలలు, 9 జడ్పీ మోడల్ హైస్కూళ్లకు పంపిణీ చేయనున్నారు. ఈ ఏడాది నుంచి పాఠ్య పుస్తకాలు కూడా మారుతున్నందున త్వరలో అవి కూడా వస్తాయని అధికారులు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కనీసం పాఠ్య పుస్తకాలు కూడా పంపిణీ చేయలేదు. గత ఏడాది కొత్త ప్రభుత్వం ఏర్పడడంతోనే ఇంటర్ విద్యార్థులకు ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది తరగతుల ప్రారంభానికి ముందే పుస్తకాలు పంపిణీకి సిద్ధం చేశారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

కొంతకాలంగా వైసీపీకి దూరంగా ఉంటున్నారు. దీంతో కార్పొరేటర్లుగా ఉన్న ఆయన భార్య, కోడలు కూడా వైసీపీకి దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ బలం 31కే పరిమితం అయిందని చెప్పుకోవాలి. కౌన్సిల్‌లో వైసీపీ బలం తగ్గిపోవడం, తమ బలం పెరగడంతో కూటమి నేతలు మేయర్ గొలగాని హరి వెంకటకుమారిపై అవిశ్వాస తీర్మానం కోరుతూ మార్చి 21న ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. మేయర్‌పై అవిశ్వాసం నెగ్గాలంటే కౌన్సిల్‌లో ఓటుహక్కు కలిగిన సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు మద్దతు ఉండాలి. అంటే జీవీఎంసీలో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు ఉండగా, జీవీఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు ఎనిమిది మంది, ఎంపీలు ఇద్దరు, రాజ్యసభ సభ్యుడు ఒకరు, ఎమ్మెల్సీలు నలుగురు మొత్తం 14 మంది ఓటు హక్కు కలిగిన ఎక్స్‌అఫిషియో సభ్యులు ఉన్నారు. వీరితో కలుపుకుంటే మొత్తం 111 మందిలో 74 మంది అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కౌన్సిల్‌లో పరిశీలిస్తే టీడీపీకి 48 మంది కార్పొరేటర్లు, జనసేనకు 11 మంది, బీజేపీకి ఇద్దరు కార్పొరేటర్ల బలం ఉంది. వీరు కాకుండా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఒక ఎమ్మెల్సీ కలుపుకుంటే 72 మంది బలం ఉంది. అవిశ్వాసం నెగ్గాలంటే మరో ఇద్దరు సభ్యుల మద్దతు అవసరం. వారిద్దరినీ తమ వైపు లాగడం కోసం కూటమి నేతలు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. వైసీపీ పట్ల అసంతృప్తితో ఉన్న ముత్తంశెట్టి ప్రియాంకతోపాటు బెహరా భాస్కరరావు కుటుంబంలో ఉన్న ఇద్దరు కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటేస్తే మ్యాజిక్ ఫిగర్‌ను దాటవచ్చునని భావిస్తున్నారు. సీపీఐ సభ్యుడు ఏజే స్టాలిన్‌తోపాటు వైసీపీకి చెందిన మరికొందరు తమకు అనుకూలంగా ఓటువేస్తారని కూటమి నేతలు విశ్వాసంతో ఉన్నారు. దీనివల్ల ఎలాగైనా అవిశ్వాసం నెగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అవిశ్వాసం వీగిపోయేలా వైసీపీ ఆరాటం

అవిశ్వాసతీర్మానం వీగిపోయేలా చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. అందుకోసమే తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లను బెంగళూరు క్యాంపునకు తరలించారు. అక్కడకు కేవలం 28 మంది మాత్రమే వెళ్లారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు వంశీరెడ్డి, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఐదో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంకతోపాటు బెహరా భాస్కరరావు కుటుంబసభ్యులు నగరంలోనే ఉండిపోయారు. వ్యక్తిగత కారణాలతో సతీష్, రోహిణి రాలేదని చెబుతున్న నేతలు...మిగిలిన ముగ్గురు గురించి మాట్లాడం లేదు. ఇదిలావుంటే వైసీపీలో ఉన్న కొందరు తమకు అనుకూలంగా ఓటువేస్తారని కూటమి నేతలు చెబుతుంటే...కూటమి వైపున్న కార్పొరేటర్లలో కొందరు కౌన్సిల్ సమావేశానికి గైర్హాజరవడం ద్వారా సహకరిస్తారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. మేయర్ బల నిరూపణకు ఏప్రిల్ 19న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిర్ణయించారు. మంగళవారం దీనిపై అధికారికంగా ప్రకటన చేసి సభ్యులతోపాటు ఎక్స్‌అఫిషియో సభ్యులకు నోటీసులు అందజేయనున్నారు.

గ్రేటర్ రికార్డు

... 5వ పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పన్ను బకాయిలు వసూలయ్యేందుకు దోహదపడింది. వీటన్నింటి కారణంగా ఈ ఏడాది రూ.510 కోట్లకుపైగా పన్ను వసూలైంది. రికార్డు స్థాయిలో పన్నులు వసూలుకావడం ఆనందంగా ఉందని, దీనికి జిల్లా కలెక్టర్, డీసీఆర్, జోనల్ కమిషనర్లతోపాటు రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది కృషి కారణమని అదనపు కమిషనర్ సోమన్నారాయణ ఆనందం వ్యక్తంచేశారు.

నేటి నుంచి కేజీహెచ్‌లో ప్రతి రోజూ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

... 5వ పేజీ తరువాయి

అందిస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అన్ని పని దినాల్లో ఈ సేవలు అందించనున్నారు. అలాగే, కార్డియాలజీ, కార్డియో థొరాసిక్, ప్లాస్టిక్ సర్జరీ, మెడికల్ అంకాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, సర్జికల్ అంకాలజీ, నెఫ్రాలజీ విభాగాల్లో సోమవారం నుంచి శనివారం వరకూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అనంతరం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల ఓపీ సేవలు అందించనున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ఈ మార్పులు చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషాలిటీ వైద్యులను నిత్యం రోగులకు అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1.31 కోట్ల ఆదాయం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం సెలవైనప్పటికీ ప్రభుత్వం ఆదేశం మేరకు ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో పనిచేసింది. జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా 99 డాక్యుమెంట్లు రిజిస్టర్ కాగా రూ.1.31 కోట్ల ఆదాయం వచ్చింది. ఒక్క మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారానే రూ.33 లక్షలు వచ్చినట్టు జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు తెలిపారు. ఉగాది రోజున అంటే ఆదివారం రూ.82 లక్షల ఆదాయం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ రెండు రోజులు పనిచేయడం వల్ల 146 రిజిస్ట్రేషన్లతో రూ.2.13 కోట్ల ఆదాయం సమకూరింది.

కేటుగాడు

- అశ్లీల వీడియోలతో మహిళకు బ్లాక్ మెయిల్
- రూ. 4 కోట్లు నగదు, 800 గ్రాముల బంగారం కాజేసిన మోసగాడు
- సీపీని ఆశ్రయించిన బాధితురాలు
- త్రీటౌన్ పోలీసుల అదుపులో నిందితుడు


అక్షయ్‌కుమార్

మద్దిలపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాంగ్ ఫోన్ కాల్ మాట్లాడినందుకు ఓ మహిళ ఏకంగా రూ.4 కోట్లు నగదు, 800 గ్రాముల బంగారం పోగొట్టుకోవడమే కాకుండా పదేళ్లు మానసిక నరకం అనుభవించింది. అయినా వేధింపులు ఆగకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భార్యను కాపాడి విషయం తెలుసుకున్న భర్త గత నెల 23న నగర పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో రెవెన్యూ కాలనీకి చెందిన బుర్లసంవర్తి పూరి అక్షయ్‌కుమార్ (39) రియల్ ఎస్టేట్ వ్యాపారి. అతను ఓ దంత వైద్యురాలిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు. భర్త జులయిగా తిరగడంతో భార్య విడాకులు తీసుకుంది. ఒక కుమార్తె అక్షయ్‌కుమార్ వద్ద, మరో కుమార్తె అతని భార్య వద్ద ఉంటున్నారు. 2014లో అతను ఆకతాయిగా ఓ ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. అది భీమవరంలో బంగారు ఆభరణల షోరూమ్ భార్యకు వెళ్లింది. ఫోన్ కాల్‌ను ఆమె మాట్లాడి రాంగ్ నంబర్ అని కట్ చేసి నా.. మహిళ వాయిస్ విన్న అక్షయ్ పదే పదే ఫోన్ చేసి ఆమెకు మాయ మాటలు చెప్పి పరిచయం పెంచుకున్నాడు. అది కాస్తా స్నేహంగా మారడంతో వ్యక్తిగత విషయాలు కూడా మహిళ ఫోన్‌లో చెప్పడం, వాటిని రికార్డ్ చేసి బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. శారీరకంగా కలవడానికి ఒప్పుకోవాలని లేదంటే కాల్ రికార్డ్స్ భర్తకు పంపిస్తానని బెదిరించాడు. భర్తకు తెలిస్తే ఏమవుతుందన్న భయంతో అక్షయ్‌తో ఆమె అంగీకరించింది. ఈమేరకు ఆమెకు తెలియకుండా అశ్లీల వీడియోను ఫోన్‌లో రికార్డ్ చేశాడు. ఆ వీడియోలతో నగదు కావాలని బ్లాక్ మెయిల్ చేశాడు. పలు దఫాలుగా అతని యూనియన్ బ్యాంక్, కరూర్ వైశ్యబ్యాంక్ ఖాతాలకు రూ. 3 కోట్లకు పైగా బదిలీ చేసింది. 800 గ్రాముల బంగారం కూడా కాజేశాడు. భర్తకు తెలిసిపోతుందని రెండుసార్లు విశాఖకు పిలిచి సీఎంఆర్ సెంట్రల్ ఎదురుగా ఒకసారి రూ.10 లక్షలు, మరోసారి రూ. 5 లక్షలు తీసుకున్నాడు. మళ్లీ మళ్లీ నగదు కావాలని బ్లాక్‌మెయిల్ చేశాడు. ఇక ఇవ్వడానికి ఆమె వద్ద నగదు లేకపోవడంతో భీమవరంలో ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. దీంతో అసలు విషయం తెలుసుకున్న ఆమె భర్త సీపీకి ఫిర్యాదు చేశాడు. త్రీ టౌన్ పోలీసులు అక్షయ్‌ను తిరుపతిలో అరెస్ట్ రిమాండ్‌కు పంపించారు. అతని వద్ద 75 గ్రాముల బంగారం, ఎస్ క్రాస్ కారును స్వాధీనం చేసుకున్నారు. అతని బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారు.

గుర్రంపాలెంలో ఆగని తవ్వకాలు

- పెద చెరువులో అక్రమాల వెనుక వైసీపీ నేత


గుర్రంపాలెం పెదచెరువులో అక్రమంగా మట్టితవ్విన దృశ్యం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం గుర్రంపాలెం ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ లేఅవుట్‌లో ప్లాట్ యజమానులు కొందరు సమీపంలో పెదచెరువు నుంచి అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నారు. రెండు నెలల క్రితం వరకు లేఅవుట్‌కు ఎగువ భాగంలో కొండల నుంచి గ్రావెల్ తవ్వి తరలించడంపై గనుల శాఖ షోకాజ్ జారీచేయడానికి నిర్ణయించింది. దీంతో యజమానులు రూటుమార్చి లేఅవుట్‌కు పడమరవైపున్న పెద చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుకింద గుర్రంపాలెం, అక్కిరెడ్డిపాలెం, ఖాజీపేట, రాజీపేట పంచాయతీల పరిధిలో సుమారు 300 ఎకరాల ఆయకట్టుంది. తవ్వకాల వెనుక వైసీపీ నేత ప్రోత్సాహం ఉందని, ఆ నేత బంధువులకు ఏపీఐఐసీ లేఅవుట్‌లో ప్లాట్లు ఉన్నాయని చెబుతున్నారు. దీనిపై గనుల శాఖకు ఫిర్యాదుచేయాలని స్థానికులు నిర్ణయించారు.

'పార్కింగ్ ఉత్తర్వులు పక్కాగా అమలు చేయండి'

మహారాణిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య సముదాయాలలో వాహనాల పార్కింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 44ను మంగళవారం నుంచి పక్కాగా అమలుజరపాలని వినియోగదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసనాయుడు కోరారు. సోమవారం మహారాణిపేటలోని అఫీషియల్ కాలనీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాణిజ్య సంస్థలలో పార్కింగ్ వసూళ్ల వ్యవహారంపై గత అక్టోబరులో వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి చేసిన విన్నపాన్ని మన్నించి ప్రభుత్వం జీవోతోపాటు మార్గదర్శకాలను జారీ చేసిందని చెబుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వానికి తమ సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. వాణిజ్య సంస్థలు, మాల్స్, మల్టీప్లెక్స్‌లలో ఉత్తర్వుల అమలుపై పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ మూల వెంకటరావు, కరణంరెడ్డి నరసింగరావు, దీపక్ వర్మ, రాజా, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నూతన కార్యవర్గం

సీతమ్మధార, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నికను సోమవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శిగా జె.వి.ప్రభాకర్, కోశాధికారిగా గార సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మద్ది అప్పలకొండ, అలమండ ప్రసాద్, సాహాయ కార్యదర్శులుగా బి.గౌతమ్ బాబు, పతివాడ రాంబాబు, మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

అప్పన్న చందనోత్సవాన్ని విజయవంతం చేయాలి

- ప్రత్యేక అధికారిణి భ్రమరాంబ


సమావేశంలో ఈవో సుబ్బారావు, సీఎఫ్‌వో భ్రమరాంబ, అధికారులు

సింహాచలం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీ నృసింహస్వామి నిజరూప దర్శనం చందనోత్సవానికి సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని చందనోత్సవ ముఖ్య అధికారి (ఆర్‌జేసీ) ధర్మముళ్ల భ్రమరాంబ కోరారు. ఈనెల 30న జరగనున్న చందనోత్సవంపై ఈవో కె.సుబ్బారావుతో కలిసి సోమవారం సింహగిరిపై దేవస్థానం అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామాన్య భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికలతో కృషి చేయాలన్నారు. క్యూలు, పార్కింగ్ స్థలాల ఏర్పాటుపై కార్యనిర్వాహక ఇంజనీర్లు దండు గణపతి శ్రీనివాసరాజు, బండారు రాంబాబు వివరించారు. లక్షన్నరకు పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లకు పూర్తిస్థాయిలో నీడ కల్పించాలని, భక్తులందరికీ తాగునీరు, మజ్జిగ అందేలా చూడాలన్నారు. భక్తుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, తాత్కాలిక మరుగుదొడ్లను సిద్ధం చేయాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. ఉత్సవంలో స్వచ్ఛంద సంస్థల సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈఓ నక్కాన ఆనందకుమార్, పిళ్లా శ్రీనివాస్, డీఈఈ డీవీఎస్ రామరాజు, పర్యవేక్షణాధికారులు రాజ్యలక్ష్మి, ప్రసన్నలక్ష్మి, సత్యవాణి, గాయత్రి, శ్రీనివాస్, నరసింగరావు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న నారా లోకేశ్

నారా లోకేశ్‌కు ఘన స్వాగతం

గాజువాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం వెళ్తున్న రాష్ట్ర ఐటీ, మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేశ్‌కు పాత గాజువాక జంక్షన్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం లోకేశ్‌కు స్వాగతించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, నల్లూరు సూర్యనారాయణ, గొర్లె వెంకునాయుడు, పులి వెంకటరమణారెడ్డి, గోమాడ వాసు, రామ్మోహన్‌కుమార్, నమ్మి అప్పారావు, డి.పెరుమాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ ఉచితం

గాజువాక, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్-44 ద్వారా షాపింగ్‌మాల్స్‌లో మంగళవారం నుంచి వినియోగదారులకు పార్కింగ్ ఉచితమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. సోమవారం గాజువాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్కింగ్ ఫీజులపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. పార్కింగ్ చేసిన తొలి అరగంట పాటు ఉచితమని, ఆ తర్వాత అరగంట వరకు సంబంధిత మాల్‌లో షాపింగ్ చేసినట్టు బిల్లు చూపితే ఉచితం వరిస్తుందని పేర్కొన్నారు. గంట కంటే ఎక్కువ సమయం ఉంటే పార్కింగ్ ఫీజు కన్నా ఎక్కువ షాపింగ్ చేసిన బిల్లు లేదా సినిమా టిక్కెట్లు చూపించాలని సూచించారు. సమావేశంలో నాయకులు రాజు, దీపక్ వర్మ, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్విమ్మింగ్‌లో శిక్షణ

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ క్లబ్ ఆవరణలో గల స్విమ్మింగ్‌ఫూల్‌లో ఏప్రిల్ రెండు నుంచి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ ఒక ప్రకటనతో తెలిపారు. క్లబ్ సభ్యులతో పాటు ఇతరులకు కూడా నామమాత్రం ఫీజుతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను స్టీల్ క్లబ్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

అక్కిరెడ్డిపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రతి శనివారం నిర్వహించే శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి స్థానికంగా ఉంటున్న కోడె పవన్‌కుమార్, సత్యవాణి దంపతులు సోమవారం విరాళం రూ.లక్షను పాలక మండలి సభ్యులకు అందజేశారు. అలాగే వెంకటేశ్వర కాలనీకి చెందిన కె.శ్రీనివాస్, ఆర్షిత దంపతులు రూ.25 వేల విలువైన 108 సాలగ్రాములతో కూడిన వెండిమాలను బహూకరించారు.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **మ్యాడ్** : జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● **పెళ్లికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
● **కోర్ట్** : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఛావా** : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 22, బంగాళదుంపలు 15, అరటికాయ8, మునక్కాడలు (కిలో) 32, అల్లం 50, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోసకాయలు 28, వెల్లుల్లి 105, కొబ్బరికాయ 25, బీన్స్ 50, కీరదోస 22, కాప్సికమ్ 38, పొట్లకాయ 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256



కొత్తపాలెం ఈద్‌గాహ్ వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



కుంచుమాంబ కాలనీ మసీద్ వద్ద ముస్లింలనుద్దేశించి మాట్లాడుతున్న మతపెద్ద

భక్తి శ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్

» మసీదులు, దర్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

ఆటోనగర్/కూర్మన్నపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండగను ముస్లిం సోదరులు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లిం సంఘాలు, మసీదు కమిటీలు, దర్గా కమిటీల నిర్వాహకులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈద్ ఉల్ ఫితర్ నమాజ్‌ను ఆచరించేందుకు ఉదయం నుంచే అధిక సంఖ్యలో ముస్లింలు తమ సమీపంలోని మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పఠనం వంటివి చేపట్టారు. ఆయా మసీదులలో ధార్మిక ప్రసంగాలు ముగిశాక సామూహిక ఈద్ నమాజ్‌లలో పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మసీదులన్నీ ముస్లిం సోదరులతో కళకళలాడాయి. ఇందులో భాగంగా 70, 71 వార్డుల పరిధిలో గల ఆటోనగర్, కుంచుమాంబ కాలనీ మసీదుల్లో ముస్లింలు సామూహిక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ 70వ వార్డు మైనారిటీ సెల్ అధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసి ముస్లిం సోదరులు తమ ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. అనంతరం మత పెద్దలు తమ బోధనలను వినిపించారు. కార్యక్రమంలో సలార్ బాబా, మహ్మద్, అబ్దుల్ రహీమ్, అయూబ్, ఖాసీం, ముస్తఫా, జిలానీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే 86వ వార్డు ఫకీరు తఖ్యాలో, 87వ వార్డు వడ్లపూడిలో ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ, వైసీపీ నాయకులు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



గాజువాకలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

గాజువాకలో ముస్లింల ర్యాలీ

గాజువాక: రంజాన్ పండగను పురస్కరించుకుని గాజువాకలోని అజీమాబాద్‌లో ఉన్న సున్నీ జామా మసీద్ నుంచి బీసీ రోడ్డులో గల ఈద్గా మైదానం వరకు భారీ ర్యాలీని చేపట్టారు. అనంతరం ముస్లిం సోదరులు సామూహిక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే పండగ రంజాన్ అని, ముస్లింలందరూ ఐక్యంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహ్మద్ రఫీ, పలువురు మత పెద్దలు పాల్గొన్నారు. అలాగే ఇస్లాంపేట, స్టీల్‌ప్లాంట్ మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, ఫార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి మసీద్‌లో ఇబ్రహీం కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో షేక్ రెహమాన్, నూర్ బాషా, షేక్ బాబ్జీ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు. పెదమదకలోని అబూబకర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దేశేంద్ర, అబ్దుల్, రహీం, హుస్సేన్, సిలారి, ఉస్మాన్, సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: కొత్తపాలెం నూరానియా మసీదు, గోపాలపట్నం తాహ మసీదు, నందమూరినగర్ ఉమర్ సుల్తాన్ మసీదుల్లో ఈదుల్ ఫిత్ర్ నమాజు కోసం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకున్నారు. మసీదు ఇమామ్ ధార్మిక ప్రసంగం ముగిసిన తరువాత సామూహిక ఈద్ నమాజుల్లో పాల్గొన్నారు. అనంతం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్తపాలెం సంతోష్‌నగర్ ఈద్‌గాహ్ వద్ద 89వ వార్డు ముస్లింలు ఈద్ నమాజ్ ఆచరించారు.

పెందుర్తి: మండలంలోని పెందుర్తి, చినముషిడివాడ, సరిపల్లి మసీద్‌లలో ముస్లింలు సామూహికంగా నమాజ్‌లు చేశారు. ఖురాన్‌ను పఠించి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చినముషిడివాడలో మజీద్ ఏ నూర్ కమిటీ అధ్యక్షుడు షేక్ బ్రహన్, పులగాలిపాలెంలో షేక్ సాహుల్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

జనసేన సంస్థాగత నిర్మాణమే ప్రస్తుత లక్ష్యం

» పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని పూర్తి సంస్థాగతంగా నిర్మించడమే ప్రస్తుత లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆ పార్టీ నాయకులు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీతంపేటలోని జనసేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదకొండు ఏళ్లుగా ప్రజా సంక్షేమం, పేదరిక నిర్మూలన, అవినీతికి వ్యతిరేకంగా పోరాటం, నవ సమాజ నిర్మాణమే ప్రధాన అంశాలుగా అధినేత పవన్ కల్యాణ్ నేతృత్వంలో పనిచేస్తున్నామన్నారు. పార్టీ అంచెలంచెలుగా ఎదిగి ఇప్పుడు 11.81 లక్షల మంది సభ్యులతో కళకళలాడుతోందన్నారు. పార్టీ జెండా మోసే కార్యకర్త కుటుంబానికి బీమా ద్వారా భరోసా కల్పించిన ఏకైక పార్టీగా జనసేన నిలిచిందన్నారు. ఏ అధికారం లేకుండా ఒక్క ఎమ్మెల్యే/ఎంపీ లేకుండా పార్టీని పదకొండేళ్లు నడపడం ఆషామాషీ కాదన్నారు. ఇప్పుడు బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణం జరుగుతోందన్నారు. విశాఖలో గత వైసీపీ పెద్దలు ప్రభుత్వ భూములు, పర్యాటక ఆస్తులను ఆక్రమించుకున్నారని, ఇలాంటి ఇబ్బందులను అధిగమించి, నగరాన్ని అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందన్నారు. త్వరలో మెట్రో రైలు ప్రాజెక్టు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకరరావు, పార్టీ నాయకులు కోన తాతారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్. పక్కన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ శివశంకర్ తదితరులు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం

కూర్మన్నపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి పద్మశాలి వీధిలో గల శ్రీఉమామార్కండేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీభావనారుషి, భద్రావతిల కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ముళ్లపూడి శ్రీనివాసశర్మ తలంబ్రాలు, సప్తపదులు, మాంగళ్యధారణను శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

పెదగంట్యాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన భవ్యశ్రీకి 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుచ్చా విజయ్‌కుమార్‌లు పదమూడు వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. 65వ వార్డుకు చెందిన భవ్యశ్రీ త్వరలో నేపాల్‌లో పది రోజుల పాటు జరగనున్న పవర్‌లిఫ్టింగ్ శిక్షణకు వెళ్తున్న సందర్భంగా ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. భవిష్యత్తులో మరింతగా భవ్యశ్రీ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివంగి నాగేశ్వరరావు, కర్రి కృష్ణ, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎదురువానిపాలెంలో ఇళ్ల నిర్మాణాలకు లైన్ క్లియర్

» ఎమ్మెల్యే గణబాబు చొరవతో తొలగిపోయిన నేవీ ఆంక్షలు
» హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

మల్కాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 58వ వార్డు ఎదురువానిపాలెం, ములగాడ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఇక జీవీఎంసీ నుంచి అనుమతులు లభించనున్నాయి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) చొరవతో ఐఎన్ఎస్ ఏకశిల (నేవీ) ప్రహరీ అనుకొని ఉన్న గ్రామాలకు నేవీ ఆంక్షలు తొలగిపోయాయి. ఈ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలకు నేవీ ఆంక్షల మేరకు జీవీఎంసీ అధికారులు అనుమతులు ఇచ్చే అవకాశం లేదు. ఒక్క అంతస్తు వరకు మాత్రమే నిర్మించాలనే నిబంధన ఉండేది. ఈ నేపథ్యంలో గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యను వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు ఎమ్మెల్యే గణబాబు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి, నేవీ అధికారులతో చర్చించారు. దీంతో వారు భవన నిర్మాణాలకు అనుమతించడంతో పాటు జీవీఎంసీ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇకపై ఈ రెండు గ్రామాల్లో భవన నిర్మాణాలకు అడ్డంకులు తొలగిపోయినట్టే. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే గణబాబును గ్రామస్థులంతా సోమవారం సత్కరించి వేంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని బహూకరించారు. సహకరించిన వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యేను జ్ఞాపికతో సత్కరిస్తున్న ఎదురువానిపాలెం గ్రామస్థులు

జోన్-8లో రూ.1.15 కోట్ల పన్ను వసూలు

వేపగుంట మార్చి 31(ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయం పరిధిలో సోమవారం సుమారు రూ.1.5 కోట్ల పన్ను వసూలయింది. అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేసి రాత్రి 11గంటల వరకు పన్ను వసూలు చేశారు. రాత్రి ఏడు గంటల వరకు 1400 అసెస్‌మెంట్ల నుంచి రూ.1.15 కోట్ల పన్ను వసూలయింది. 93, 94, 95, 96వ వార్డుల్లో అధికంగా ఖాళీ స్థలాలు, ఇంటి పన్నులు వసూలు చేశామని జెడ్సీ కె.హైమావతి తెలిపారు.

ఘనంగా త్రిమాత ఆలయ వార్షికోత్సవం

పెందుర్తిరూరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల అగ్రహారం దుర్గమాంబ, బండిమాంబ, మెట్టమాంబ (త్రిమాత)ల ఆలయ 16వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త మద్దాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్పొరేటరు ముమ్మన దేముడు, సర్పంచి దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచులు ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, పి.వెంకటరమణ,మళ్ల కృష్ణ, పి.శంకర్, పి.డి. ప్రసాద్ తదితరులు అమ్మవార్లను దర్శించారు. ఆలయ పరిసరాలను మెరుగు పర్చడానికి సహకరించిన రైల్వే ఇంజనీరు సద్దేశ్‌ను సత్కరించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సంప్రదాయ వస్త్రధారణ, కామెడీ స్కిట్లను చిన్నారులు ప్రదర్శించారు.

దేశంలో ఐదో ఆర్థిక నగరంగా విశాఖ అభివృద్ధి

ఐటీ మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నాన్ని దేశంలో ఐదవ ఆర్థిక నగరంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలో 'తాజ్-వరుణ్ గ్రూపు ఆధ్వర్యంలో 'వరుణ్ బే శాండ్స్' పేరుతో నిర్మించనున్న స్టార్ హోటల్, ఆఫీస్ టవర్లకు తల్లి భువనేశ్వరితో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదని, ఇప్పుడు చంద్రబాబు 'బ్రాండ్'స్పష్టంగా కనిపించేలా పరిశ్రమలను, పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.500 కోట్ల సంయుక్త పెట్టుబడి రాష్ట్రానికి వస్తోందన్నారు. ఇందులో 3,500 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, హోం మంత్రి అనిత, పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, వరుణ్ గ్రూపు చైర్మన్ ప్రభు కిశోర్, ఎండీ వరుణ్‌దేవ్, జేఎండీ వర్ష పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీభరత్, వరుణ్ గ్రూపు చైర్మన్ ప్రభు కిశోర్, తదితరులు



సరదాగా టేబుల్ టెన్నిస్ ఆడుతున్న ఎమ్మెల్యే గణబాబు, పద్మనాభన్

క్రీడలతో మానసిక ఉల్లాసం

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

కూర్మన్నపాలెం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని పశ్చిమ ఎమ్మెల్యే, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి పి.గణబాబు అన్నారు. 88వ వార్డు పరిధి వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్ సిటీ లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీలో టేబుల్ టెన్నిస్, స్పోర్ట్స్ లైబ్రరీని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రీన్ సిటీలో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసేందుకు కృషి చేస్తున్న అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ ఎంవీ మురళీకృష్ణ, వైజాగ్ ప్రొఫైల్స్ వ్యవస్థాపకుల సేవలు అభినందనీయమన్నారు. ఐఆర్ఎస్ కమిషనర్ ఐటీ పద్మనాభన్ మాట్లాడుతూ క్రీడాకారుల సమగ్ర వ్యక్తిత్వాలను పెంపొందించే స్పోర్ట్స్ లైబ్రరీ, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన పేరెంట్స్ లాంజ్, క్రీడా సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా క్రీడల పట్ల నిర్వాహకులకు ఉన్న అభిలాషను తెలియజేస్తుందన్నారు. ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు, వైజాగ్ ప్రొఫైల్స్ ఎండి బండి సురేశ్‌కుమార్, డైరెక్టర్ వీవీ కృష్ణారావులు మాట్లాడుతూ క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరచి దేశ ఖ్యాతిని ఖండాంతరాలకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత క్రీడాకారులపై ఉందన్నారు. కార్యక్రమంలో క్రీడా ప్రతినిధులు ఈ.శంకరరావు, మల్లికార్జున్, వెలగ వెంకటరావు, సునీల్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విండ్‌బాల్ క్రికెట్ పోటీలు



విండ్‌బాల్ క్రికెట్ పోటీలో విజేతగా నిలిచిన మేవారిక్స్ జట్టు

మల్కాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయని 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ కాలనీలో నిర్వహించిన ఇండస్ట్రియల్ కాలనీ సీజన్ ప్రీమియర్ లీగ్ (ఐసీపీఎల్) విండ్‌బాల్ క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మేవారిక్స్ టీమ్ విజేతగా నిలవగా, రన్నర్స్‌గా థండర్ బోర్ట్స్ జట్టు నిలిచింది. వెంకట సత్యనారాయణ రాజు, చంద్రమౌళి, సురేష్, ప్రభాకర్, సూరజ్, కామరాజు పాల్గొన్నారు.

ఇంటక్ స్టీల్‌ప్లాంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజీనామా

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇంటక్ స్టీల్‌ప్లాంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని యూనియన్ నాయకత్వానికి సోమవారం అందజేశారు. తనపై వచ్చిన అసత్య ఆరోపణలు వస్తున్నాయని, కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత విషయాలను తప్పుగా ప్రచారం చేస్తున్నారని, తన నిజాయితీని నిరూపించుకునేంత వరకు రాజీనామా చేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు భారీగా దరఖాస్తులు

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచితంగా ప్రాథమిక కుట్టు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా బీసీ సంక్షేమశాఖ అధికారులు దరఖాస్తులు ఆహ్వానించగా భారీ స్పందన వచ్చింది. బీసీ సంక్షేమశాఖ పరిధిలోని బీసీ, కమ్మ, రెడ్డి, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా ఆయా కులాల మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందించనున్నారు. ఇందుకోసం జిల్లాకు 3,596 యూనిట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. కాగా జిల్లా వ్యాప్తంగా 18,300కు పైగా దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. వడపోత ప్రక్రియను రెండు రోజుల్లో చేపట్టనున్నారు. అర్హుల ఎంపికకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తాయని చెబుతున్నారు. ఎంపికైన మహిళలకు 45, 60, 90 రోజులపాటు శిక్షణ ఉంటుంది. ఆ తరువాత వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారు.

180 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి , మార్చి31 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఆరుగురిని పట్టుకుని వారి నుంచి 180 కేజీల గంజాయిని టాస్క్ ఫోర్స్ పోలీసులు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. పెందుర్తి నాలుగు రోడ్ల జంక్షన్‌లో మాటు వేసిన పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఓ పెద్ద వాహనంలో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న 180 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురికి అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద రూ.10వేల నగదును కూడా స్వాధీనం చేసుకొని పెందుర్తి పోలీసులకు అప్పగించారు. అరకు నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలించే ప్రయత్నంలో భాగంగా నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు.

జెర్రిపోతులపాలెంలో పెద్దలకు ఇళ్లపై ఆరా

» అక్రమార్కులపై చర్యలకు అధికారుల యోచన

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులకు ఇళ్ల మంజూరు వ్యవహారాన్ని హౌసింగ్ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. దీనికి సంబంధించి 'పేదల కాలనీలో పెద్దలకు ఇళ్లు' శీర్షికన మార్చి 27న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి హౌసింగ్ అధికారులు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మంజూరుకు సంబంధించి వివరాల కోసం పెందుర్తి తహసీల్దారు కార్యాలయం నుంచి సమాచారం తీసుకోవాలని యోచిస్తున్నారు. గ్రామంలో మొత్తం 134 మందికి వైసీపీ హయాంలో 1.5 సెంట్లు విస్తీర్ణంలో ప్లాట్లు వేసి, ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు మంజూరుచేశారు. సగానికిపైగా అనర్హులుండడంపై గత ఏడాది చివర్లో విచారణ చేపట్టారు. సుమారు 60 మంది అనర్హులున్నారని వీఆర్వో విచారణలో తేలగా ఈ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవడానికి రెవెన్యూ అధికారులు ముందుకురాలేదు. అయితే 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అనర్హులపై చర్యల కోసం కలెక్టర్ అనుమతి తీసుకోవాలని నిర్ణయించారు.